నేటి కందం- నేటికి అందం

నీరజ నేత్రుని దయతో?.
తీరుగ స్వాస్థ్యమ్ము నొసగు దేవళ మనుచున్
భారత ప్రధాని మోడీ
ఆరోగ్యపు టాలయమ్ము నారంభించెన్ !!

(హైదరాబాద్ నగరంలోని గచ్చిబౌలిలో భారత ప్రధాని నరేంద్ర మోడీ 18 అంతస్తులతో 1500 పడకలు గల అతిపెద్ద సుధా హాస్పిటల్ ను ప్రారంభించారు. ఇది అందరికీ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్ సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

చురక

తెలంగాణ మాదేనని
తీర్పు ఇప్పుదే ఎందుకు
నిధులిస్తూ అభివృద్ధికి
నడవకుండా ముందుకు.
తాటాకు మంటలాగా
తాత్కాలిక సభల జోషు
కమలానికి దగ్గరగా
కాగలదా ప్రజల హోషు

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ మంగళవారం 12-5-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:215 పేజీలు:6 వెల: రూ.1/-

# ఎస్ఐఆర్‌ను బీజేపీ ఆయుధంగా ఉపయోగిస్తోంది: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మే 11:రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం తప్పనిసరి అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ హక్కుల కోసం తాము కేంద్రంతో పోరాడుతామని వ్యాఖ్యానించారు. ఈరోజు (సోమవారం) సీఎం రేవంత్‌రెడ్డి మీడియాతో చిట్ చాట్ చేశారు. ఈ చిట్‌చాట్‌లో కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీ విధానాలు, రాష్ట్ర అభివృద్ధి, మావోయిస్టుల సరెండర్‌లు, మహిళా రిజర్వేషన్లు, రీజినల్ రింగ్ రోడ్, బండి భగీరథ్ కేసు వంటి అనేక కీలక అంశాలపై స్పందించారు.

**ప్రధాని మోదీతో అభివృద్ధి అంశాలపైనే చర్చ..**

ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిన్న(ఆదివారం) హెచ్ఐసీసీలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. హెచ్ఐసీసీలో జరిగిన ప్రభుత్వ కార్యక్రమంలో ప్రధాని మోదీతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తాను ప్రస్తావించిన అభివృద్ధి అంశాలను ప్రధాని మోదీ అంగీకరించారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు కేంద్ర సహకారం అవసరమని, అదే విషయాన్ని మోదీ దృష్టికి తాను తీసుకెళ్లానని చెప్పుకొచ్చారు. 'నేను బీజేపీని ఓడించిన ముఖ్యమంత్రిని... కానీ రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రాన్ని పరిగణనలోకి తీసుకోవాల్సిందే' అని వ్యాఖ్యానించారు. గత పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం కేంద్రాన్ని నిధులు అడగలేదని, తాము మాత్రం తెలంగాణ హక్కుల కోసం అడుగుతున్నామని పేర్కొన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో ప్రధాని మోదీ సమావేశం కావడం ప్రైవేట్ కార్యక్రమమని చెప్పుకొచ్చారు.

**కేంద్రం నిధులు ఇవ్వాలి..**

రీజినల్ రింగ్ రోడ్ ప్రాజెక్టుకు కేంద్రప్రభుత్వం 50 శాతం నిధులు ఇవ్వాలని కోరామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. మెట్రో, సదరన్ పార్ట్ రీజినల్ రింగ్ రోడ్ వంటి కొన్ని ప్రాజెక్టులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, ఎయిర్‌పోర్ట్ క్లియరెన్స్‌లు, డిఫెన్స్ ల్యాండ్స్, మూసీ ప్రాజెక్టుకు ఏడీబీ నిధులు, నేషనల్ హైవేలకు అనుమతులు వచ్చినట్లు వెల్లడించారు. కేసీఆర్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఈ పనులు ఆలస్యమయ్యాయని ఆరోపించారు.

**తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతాం..**

2034 నాటికి తెలంగాణను వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలని తాను ప్రధాని మోదీని కోరగా ఆయన అంగీకరించారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లేందుకు కేంద్ర సహకారం అవసరమని తెలిపారు. అభివృద్ధి విషయంలో కలిసి పనిచేద్దామని ప్రధాని చెప్పారని.. తమ మధ్య జరిగిన చర్చ పూర్తిగా అభివృద్ధికి సంబంధించినదేనని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

**విదేశీ విధానంలో కేంద్రం పూర్తిగా విఫలం..**

బీజేపీని 'బ్రిటిష్ జనతా పార్టీ'గా సీఎం రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. విభజించి పాలించడం ఆ పార్టీ సిద్ధాంతమని ఆరోపించారు. ముస్లింలు, క్రిస్టియన్లు, మావోయిస్టులు కూడా ఈ దేశ ప్రజలేనని, అందరికీ సమాన హక్కులు ఉన్నాయని పేర్కొన్నారు. బీజేపీ సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన వారిని ఖతం చేయడం వాళ్ల విధానమని విమర్శించారు. తమ సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన వారిని ఒప్పించి జనజీవనంలో కలపడం కాంగ్రెస్ విధానమని వ్యాఖ్యానించారు. విదేశీ విధానంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. కేంద్రానికి స్పష్టమైన విధానం లేదన్నారు. జెమిని సర్కస్ లా బీజేపీ ఎన్నికల విధానం ఉంటుందని ఎద్దేవా చేశారు. అనుభవరాహిత్యం, అహంకారం వల్లనే దేశాన్ని సంక్షోభంలోకి నెడుతున్నారని ఆరోపించారు.

**ఎస్ఐఆర్‌ను బీజేపీ ఆయుధంగా ఉపయోగిస్తోంది..**

ఎస్ఐఆర్‌ను బీజేపీ ఆయుధంగా ఉపయోగిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. పశ్చిమబెంగాల్‌లో 90 లక్షల ఓట్లను తొలగించారని ఆరోపించారు. కేరళంలో 3 సీట్లు, తమిళనాడులో ఒక సీటు మాత్రమే బీజేపీ గెలుచుకుందని ప్రస్తావించారు. ఏ రాష్ట్రంలో గెలవాలంటే అక్కడ ఎస్ఐఆర్‌ను ప్రయోగిస్తున్నారని ఫైర్ అయ్యారు. జూబ్లీహిల్స్‌లో బీజేపీకి డిపాజిట్ రాలేదని.. మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ పరిస్థితి ఏమిటని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. బీజేపీ రెండు సీట్లతో ప్రారంభమైందని.. అక్కడికే వస్తుందని విమర్శించారు. కాంగ్రెస్‌ను మోదీ విమర్శిస్తే తనను విమర్శించినట్లేనని అన్నారు. కేంద్రం నుంచి తెలంగాణకు ఆశించిన మేరకు సహకారం లేదని చెప్పారు. బీజేపీకి ప్రజాస్వామ్యంపైన నమ్మకం లేదని మండిపడ్డారు. తమిళనాడులో అతిపెద్ద పార్టీకి ప్రభుత్వ ఏర్పాటు కోసం గవర్నర్ ఆహ్వానించకుండా నిర్లక్ష్యం ఎందుకు చేశారని ప్రశ్నించారు. కాంగ్రెస్ జపం చేయకుండా బీజేపీ బతకదని విమర్శించారు.

**మావోయిస్టుల లొంగుబాటుకు ప్రత్యేక చర్యలు..**

తెలంగాణలో 818 మంది మావోయిస్టులు సరెండర్ అయ్యారని, దేశంలో ఎక్కడా ఇలాంటి పరిస్థితి లేదని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. బుల్లెట్ కాదు బ్యాలెట్ అని కాంగ్రెస్ ఎప్పటి నుంచో చెబుతోందని, చివరకు మావోయిస్టులు కూడా అదే మార్గంలోకి వచ్చారని అన్నారు. మావోయిస్టుల లొంగుబాటుకు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందని చెప్పారు. గణపతి వంటి నేతలు కూడా జనజీవన స్రవంతిలోకి రావాలని పిలుపునిచ్చారు. అవసరమైతే వైద్య సహాయం, ఆర్థిక సాయం కూడా అందిస్తామని తెలిపారు. దేశం కోసం కాంగ్రెస్ ప్రాణాలు ఇచ్చిందని ఉద్ఘాటించారు. రాజీవ్ గాంధీని చంపిన వాళ్లకు కూడా సోనియా గాంధీ క్షమాభిక్ష పెట్టారని ప్రస్తావించారు.

**ప్రధాని మోదీ వ్యాఖ్యలు దురదృష్టకరం..**

ప్రధాని మోదీ మాట్లాడిన కొన్ని మాటలు దురదృష్టకరమని సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ముస్లింలు, క్రిస్టియన్లు, ఇతర మతాలు, కులాలు, మావోయిస్టులు దేశ ప్రజలు కారా.. అందరికీ సమాన హక్కులు ఉన్నాయని తెలిపారు. బీజేపీ సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన వాళ్లను ఖతం చేయడమే వాళ్ల విధానమని మండిపడ్డారు. తమ సిద్ధాంతాన్ని వ్యతిరేకించిన వాళ్లను ఒప్పించి జనజీవనంలో కలపడం తమ విధానమని ఉద్ఘాటించారు. మనుషులను చంపడం పరిష్కారం కాదని.. ముస్లింలు, మావోయిస్టులు కూడా



ఈ దేశ భాగస్వాములేనని అన్నారు. దేశంలో ఐక్యత పెంచేలా ప్రధాని మాట్లాడాలని, విడదీసేలా వ్యాఖ్యలు చేయడం మంచిది కాదని చెప్పారు. ఇది బీజేపీ విభజన రాజకీయాలకు నిదర్శనమని ఆరోపించారు.

**విదేశాంగ విధానంపై కేంద్రంపై విమర్శలు..**

బంగారం కొనొద్దు, విమానాల్లో ప్రయాణం చేయొద్దని ప్రజలకు చెప్పడం కేంద్ర ప్రభుత్వ వైఫల్యమని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. విదేశాంగ విధానంలో కేంద్రం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రతిపక్షాల సూచనలు తీసుకోవాలని, అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి చర్చించాలని కేంద్రానికి సూచించారు. మోదీ అనుభవరాహిత్యం, అహంకారం వల్ల దేశాన్ని సంక్షోభంలోకి నెడుతున్నారని ఆరోపించారు.

**అలా మహిళా రిజర్వేషన్లు అమలు చేయొచ్చు..**

మహిళా రిజర్వేషన్‌ను దేనికి సంబంధం లేకుండా అమలు చేయడానికి అవకాశం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మహిళా రిజర్వేషన్లు అమలు చేయొచ్చని అన్నారు. నియోజకవర్గాల పునర్విభజన 543 లోక్‌సభ సీట్లను దామాషా ప్రకారం చేసేందుకు అవకాశం ఉందని తెలిపారు. 50 శాతం పెంపు అనే దానికి కూడా ఎలాంటి ఫార్ములా లేదని చెప్పుకొచ్చారు. సీట్ల పెంపకంపైనే అందరికీ అభ్యంతరాలు ఉన్నాయని అన్నారు. జమిలి ఎన్నికలు 2029లో జరిగే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు.

**బండి భగీరథ్ కేసు దర్యాప్తులో వేగం పెంచాం..**

కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై నమోదైన కేసు విషయంపై కూడా సీఎం స్పందించారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో బాలిక తల్లి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మే 8వ తేదీన ఎఫ్ఐఆర్ నమోదైందని, ప్రధాని మోదీ పర్యటన భద్రతా ఏర్పాట్ల కారణంగా విచారణ ఆలస్యమైందని వివరించారు. ఇప్పుడు దర్యాప్తు వేగవంతం చేశామని, సిట్ ఏర్పాటు చేశామని.. సీనియర్ మహిళా అధికారిని విచారణాధికారిగా నియమించినట్లు చెప్పారు. చట్టానికి ఎవరూ అతీతులు కాదని.. ఎవరినీ ఇప్పటివరకు వదలిపెట్టలేదని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

**ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై విమర్శలు..**

ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై కూడా సీఎం రేవంత్‌రెడ్డి విమర్శలు చేశారు. గతంలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ఫిర్యాదు చేసిన ఆయనే తర్వాత ప్రభాకర్ రావును నీతిమంతుడని చెప్పారని గుర్తుచేశారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ దగ్గర ఆధారాలు ఉంటే పోలీస్ కమిషనర్‌కు ఇవ్వొచ్చని.. మైక్‌ల ముందు స్టేట్‌మెంట్లు ఇవ్వడం వల్ల విచారణ జరగదన్నారు. కేటీఆర్ బామ్మర్ది ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ తీసుకుని దొరికినా తాము వదల్లేదని తెలిపారు. ఖాళీగా ఉన్నామని కేటీఆర్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పోలీసుల డ్యూటీ చేస్తామంటే ఎలా అని ప్రశ్నించారు. గడీలు బద్దలు కొడతానని గతంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ చెప్పారని ప్రస్తావించారు.

**రైతులు, ధాన్యం కొనుగోళ్లపై..**

అకాల వర్షాల వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. అయినప్పటికీ తడిసిన ధాన్యాన్ని కూడా తమ ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని చెప్పారు. వంట మార్పిడిపై రైతులకు అవగాహన కల్పించేందుకు విస్తృత చర్చలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో రైతులకు వివరణ ఇచ్చే కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

# బంగారం కొనొద్దన్న ప్రధాని మోదీ

న్యూ ఢిల్లీ, మే 11: భారతీయులకు బంగారం మీద ఎప్పటినుంచో మక్కువ ఉందనేది రహస్యమేమీ కాదు. పసిడి వినియోగదారులలో ప్రపంచంలోనే అతిపెద్ద దేశాల్లో ఒకటిగా ఉంది భారత్. అయితే.. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా బంగారం ధరలు ఒక్కసారిగా ఆకాశాన్నంటుతున్నాయి. ఈ ప్రతికూల ప్రభావాల నుంచి ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు పసిడి కొనుగోళ్లను ఏడాదిపాటు తగ్గించాలని తన హైదరాబాద్ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. దీంతో పాటు అనవసరమైన విదేశీ ప్రయాణాలు తగ్గించాలనీ సూచించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ వినియోగంలోనూ జాగ్రత్త వహించాలని పేర్కొన్నారు. విదేశీ మారక నిల్వలను కాపాడుకోవడం, దిగుమతుల భారాన్ని తగ్గించడం కోసం ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు మోదీ.

ప్రపంచంలోనే అతిపెద్ద బంగారం వినియోగ దేశాల్లో భారత్ ఒకటి. దేశీయ అవసరాల్లో దాదాపు 90 శాతం వరకు బంగారం దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఏటా 700 నుంచి 800 టన్నుల వరకు పసిడిని విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది భారత్. అంతర్జాతీయ మార్కెట్లో ధరలు పెరగడంతో ఈ వ్యయం మరింత పెరిగింది. 2025-26 ఆర్థిక ఏడాదిలో బంగారం దిగుమతుల విలువ రికార్డు స్థాయిలో 71.98 బిలియన్ డాలర్లకు చేరినట్లు నివేదికల ద్వారా స్పష్టమవుతోంది. ఇదే సమయంలో చమురు దిగుమతుల భారం కూడా పెరగడంతో దేశ వాణిజ్య లోటు మరింత విస్తరించింది.

ఆర్థిక నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ప్రస్తుత పరిస్థితుల్లో బంగారం దిగుమతులు పెరగడం రూపాయి విలువపై ఒత్తిడిని పెంచుతోంది. విదేశీ మారక నిల్వలూ తగ్గే ప్రమాదం ఉంది. ఇటీవల ఫారెక్స్ నిల్వలు గణనీయంగా తగ్గాయని రిజర్వ్ బ్యాంక్ గణాంకాలు వెల్లడించాయి. ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం కారణంగా ముడి చమురు ధరలు పెరగడం భారత్‌కు ఆందోళన కలిగిస్తోంది. దేశ అవసరాల్లో సుమారు 80-85 శాతం చమురు దిగుమతుల ద్వారానే రావడమే ఇందుకు ప్రధాన కారణం.

ఇక.. ప్రధాని మోదీ వ్యాఖ్యల ప్రభావం నేటి స్టాక్ మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపింది. ప్రముఖ జ్యువెలరీ కంపెనీల షేర్లు భారీగా పడిపోయాయి. అయితే నిపుణులు దీర్ఘకాలంలో పసిడికి డిమాండ్ తగ్గదని చెబుతున్నారు. భారతీయులలో బంగారానికి పెట్టుబడి, పొదుపు, సంప్రదాయం పరంగా ప్రత్యేక స్థానం ఉందని విశ్లేషిస్తున్నారు. తాత్కాలికంగా కొనుగోళ్లు మందగించినా.. భవిష్యత్తులో మళ్లీ డిమాండ్ పెరిగే అవకాశముందని అభిప్రాయపడుతున్నారు.

# కేంద్రమంత్రి నితిన్ గడ్కరీతో పెమ్మసాని భేటీ.. ఏపీ ప్రాజెక్టులపై చర్చ

ఢిల్లీ, మే 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఈరోజు(సోమవారం) ఢిల్లీలో పర్యటించారు. తన పర్యటనలో భాగంగా కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిశారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. గుంటూరు - విజయవాడ జాతీయ రహదారి సమన్వయం చేస్తూ కాజా టోల్‌గేట్ సమీపాన నిర్మించిన వెస్ట్ బైపాస్ వద్ద ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని కేంద్రమంత్రి గడ్కరీకి విజ్ఞప్తి చేశారు.

విజయవాడ వెస్ట్ బైపాస్ ఔఉ - 16తో కలిసే చిన్నకాకాని జంక్షన్ వద్ద ప్రస్తుతం గ్రేడ్ సెపరేటెడ్ ఇంటర్‌చేంజ్ లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని పెమ్మసాని వివరించారు. విజయవాడ వైపు వెళ్లే వాహనాలు హైల్యాండ్ ఫ్లైఓవర్ కింద ఉన్న రెండు లైన్ల సర్వీస్ రోడ్, యూటర్న్ ద్వారా వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. దీంతో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోవడం, లక్షలాది మంది ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.

రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో తెలుగుదేశం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. పల్నాడు అభివృద్ధికి సంబంధించి కీలక రైల్వే ప్రాజెక్టులపై మాట్లాడారు. పిడుగురాళ్ల - సావల్యపురం నుంచి రామాయపట్నం పోర్టుకు రైల్వేలైన్ నిర్మించాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. రామాయపట్నం పోర్టు కనెక్టివిటీతో పల్నాడులో పారిశ్రామిక, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని వివరించారు. నడికుడి లేదా పిడుగురాళ్ల స్టేషన్లలో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ (సికింద్రాబాద్ - తిరుపతి) నిలపాలని విజ్ఞపి చేశారు.

లింగంపల్లి - విజయవాడ ఎక్స్‌ప్రెస్ (12796) హాల్టింగ్ కోసం కేంద్రమంత్రికి ఎంపీ వినతిపత్రం అందజేశారు.

# సోమ్‌నాథ్ ఆలయ పునర్నిర్మాణాన్ని జవహర్‌లాల్ నెహ్రూ వ్యతిరేకించారు : ప్రధాని మోదీ



న్యూఢిల్లీ, మే 11: ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూపై తీవ్ర విమర్శలు చేశారు. స్వాతంత్ర్యానంతరం గుజరాత్ లోని సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణాన్ని నెహ్రూ వ్యతిరేకించారని ఆరోపించారు. బుజ్జగింపు రాజకీయాల కోసం జాతీయ ఆత్మగౌరవాన్ని పక్కనపెట్టే శక్తులు దేశంలో ఇప్పటికీ ఉన్నాయని, అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణం జరిగి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం నిర్వహించిన 'సోమనాథ్ అమృత్ మహోత్సవ్'లో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. '1951లో సోమనాథ్ ఆలయ పునఃప్రతిష్ఠ కేవలం ఒక సాధారణ విషయం కాదు. అది భారతదేశ స్వతంత్ర నాగరిక స్పృహకు ప్రతీక' అన్నారు. స్వాతంత్ర్యానంతరం ఆలయ పునర్నిర్మాణానికి అంకితభావంతో పనిచేసిన సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్, తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్‌ల సేవలను ప్రధాని కొనియాడారు. దేశంలోని 500కు పైగా సంస్థానాలను ఏకంచేసి ఆధునిక భారతాన్ని నిర్మించిన సర్దార్ పటేల్, సోమనాథ్ పునర్నిర్మాణం ద్వారా మన ప్రాచీన వైభవాన్ని తిరిగి పొందుతున్నామన్న సందేశాన్ని ప్రపంచానికి ఇచ్చారని మోదీ వివరించారు.

అయితే ఈ మహత్కార్యానికి నెహ్రూ నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదురైందని మోదీ ఆరోపించారు. 'ఆలయ పునర్నిర్మాణం కోసం సర్దార్ పటేల్, రాజేంద్ర ప్రసాద్ ఎంతో కృషిచేశారు. కానీ వారికి నెహ్రూజీ నుంచి ఎంత వ్యతిరేకత వచ్చిందో మనందరికీ తెలుసు. ఈ రోజు నేను ఆ వివరాల్లోకి వెళ్లడం లేదు. కానీ సర్దార్ పటేల్ సంకల్పం ముందు ఏదీ నిలవలేదు. శతాబ్దాల అవమానాన్ని చెరిపేస్తూ సోమనాథ్ ఆలయం పునర్నిర్మితమైంది..' అన్నారు. ఈ చారిత్రక నేపథ్యాన్ని ప్రస్తుత రాజకీయాలతో ముడిపెడుతూ.. జాతీయ ఆత్మగౌరవం కంటే బుజ్జగింపు రాజకీయాలకే ప్రాధాన్యమిచ్చే శక్తులు ఇప్పటికీ ఉన్నాయన్నారు.

# టెక్నాలజీలో నూతన ఆవిష్కరణలకు పూర్తి మద్దతు: సీఎం రేవంత్

హైదరాబాద్, మే 11: జాతీయ సాంకేతి దినోత్సవం సందర్భంగా శాస్త్రవేత్తలు, ఇంజినీర్లకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. టెక్నాలజీ రంగంలో నూతన ఆవిష్కరణలకు ప్రజా ప్రభుత్వం పూర్తిగా మద్దతు ఇస్తుందని సీఎం తెలిపారు.

'ప్రగతికి దారి చూపుతూ, భవిష్యత్తు తరాలకు ప్రేరణనిస్తున్న శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, పరిశోధకులు, ఆవిష్కర్తలందరికీ 'జాతీయ సాంకేతిక దినోత్సవం' సందర్భంగా శుభాకాంక్షలు. సమస్యలకు పరిష్కారాలు కనుగొనడం, భవిష్యత్ సవాళ్లను అధిగమించడం కోసం టెక్నాలజీ రంగంలో నూతన ఆవిష్కరణలకు ప్రజా ప్రభుత్వం పూర్తి స్థాయిలో మద్దతునిస్తుందన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకొని భారత టెక్నాలజీ శక్తిని ప్రపంచానికి చాటేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు' సీఎం రేవంత్ రెడ్డి ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# మలేషియా తెలుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'ఎన్టీఆర్ సజీవ చరిత్ర' పుస్తకావిష్కరణ

హైదరాబాద్, మే 11:మలేషియా తెలుగు ఫౌండేషన్ అధ్యక్షులు దాతో కాంతా రావు నాయకత్వంలో వార్షిక సమావేశంతో పాటు ప్రతిష్ఠాత్మకమైన 'ఎన్టీఆర్ సజీవ చరిత్ర' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ రంగంలో కృత్రిమ మేధస్సు నియోగంపై ప్రత్యేక సదస్సు కూడా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి 'ఎన్టీఆర్ సజీవ చరిత్ర' పుస్తకావిష్కరణ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచిన నందమూరి తారక రామారావు అసాధారణ జీవితం, దూరదృష్టి, చిరస్థాయి వారసత్వాన్ని ప్రతిబింబించే ఈ గ్రంథం ప్రత్యేక ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. సినీరంగం, ప్రజాసేవ, తెలుగు గౌరవం, సామాజిక చైతన్యానికి ఎన్టీఆర్ అందించిన విశిష్ట సేవలను ఈ పుస్తకం సజీవ చరిత్రగా ఆవిష్కరించింది. మలేషియా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజలకు ఈ కార్యక్రమం ఎంతో భావోద్వేగభరితమైన సందర్భంగా నిలిచింది.

ఈ కార్యక్రమానికి భారతదేశం నుంచి విచ్చేసిన ఎన్టీఆర్ తనయులు నందమూరి రామకృష్ణ, తెలుగుదేశం జాతీయ పార్టీ ఉపాధ్యక్షులు, ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చైర్మన్ టీడీ జనార్ధన్ ముఖ్య అతిథులుగా హాజరై సభకు విశిష్టతను చేకూర్చారు. ఎన్టీఆర్ చరిత్ర, విలువలు, స్ఫూర్తిదాయకమైన జీవిత ప్రయాణాన్ని స్మరించుకుంటూ అభిమానులు, సామాజిక నాయకులు, సాంస్కృతిక సంస్థలు కలిసి ఈ కార్యక్రమాన్ని చిరస్మరణీయ వేడుకగా మార్చారు.

ఫెడరేషన్ అఫ్ ఎన్నారై కల్చరల్ అసోసియేషన్స్ మలేషియా ప్రెసిడెంట్ బూరెడ్డి మోహన్ రెడ్డితో పాటుగా వారి ప్రతినిధులు రవి వర్మ, శివ, మంగపతి , తెలుగు ఎక్సపెట్స్ అసోసియేషన్ అఫ్ మలేషియా ప్రతినిధులు నాగరాజు , ఇంద్రనీల్ , శైలేంద్ర, పలువురు ప్రముఖులు, గౌరవ అతిథులు కార్యక్రమంలో పాల్గొని ఓఈ చేపడుతున్న సాంస్కృతిక కార్యక్రమాలను అభినందించారు.

భారత్-మలేషియా మధ్య సాంస్కృతిక సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో, తెలుగు సంస్కృతిని ప్రోత్సహించడంలో, మలేషియా బహుళ సాంస్కృతిక సమాజంలో సమాజ విలువలను పెంపొందించడంలో ఓఈ చేస్తున్న కృషికి పలువురు నాయకులు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

'ఎన్టీఆర్ సజీవ చరిత్ర' పుస్తకావిష్కరణ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడం ద్వారా తెలుగు వారసత్వ పరిరక్షణకు, సాంస్కృతిక ఐక్యతకు, భవిష్యత్తు తరాలకు స్ఫూర్తినిచ్చే సమాజ సేవా కార్యక్రమాలకు ఓఈ తన అంకితభావాన్ని మరోసారి చాటిచెప్పింది.

# నర్సుల భద్రతతో సమాజ ఆర్థిక పురోగతి

## (12 మే "అంతర్జాతీయ నర్సుల దినోత్సవం" సందర్భంగా)

ఆసుపత్రులు, క్లినిక్స్, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు లాంటి ప్రదేశాల్లో అతి ముఖ్యంగా కనుపించే కరుణామయుల్లో నర్సులు వస్తారు. రోగులకు అత్యవసర వైద్య సేవలు, సిస్టర్స్ వలె ఆత్మీయ చేయూతలు, రోగులకు వైద్యంతో పాటు భావేద్వేగ విశ్వాసాలను అందించే నిస్వార్థ ఉద్యోగులు, శస్త్రచికిత్సలో సహాయం, అంకితభావాలకు వారే ప్రతినిధులు, బేషరతుగా సాయం చేసే అమృత హస్తాలు, క్రిటికల్ కేర్, అవుట్‌పేషంట్ సేవలు, రోగుల సగం వ్యాధిని పోగొట్టదల్లే ఔషధ సపర్యలు చేస్తున్న నర్సుల అమూల్య సేవలను గుర్తించి, వారి అమూల్య సేవలకు కృతజ్ఞతలు తెలియజేయడానికి ప్రతి ఏట ఫ్లోరెన్స్ నైటింగేల్ జన్మదినం 12 మే రోజున ప్రపంచవ్యాప్తంగా 1974 నుంచి "అంతర్జాతీయ నర్సుల దినోత్సవం" పాటించుట ఆనవాయితీగా మారింది.

### అంతర్జాతీయ నర్సుల దినోత్సవం-2026 ఇతివృత్తం:

నేడు 205వ నైటింగేల్ జన్మదినం రోజున 2026 అంతర్జాతీయ నర్సుల దినోత్సవం ఇతివృత్తంగా "మన నర్సులు, మన భవిష్యత్తు : నర్సుల సాధికారతతో ప్రాణాలకు సురక్ష" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం నిర్వహిస్తున్నారు. నర్సుల పాత్ర వైద్య విధానంలో అవిభాజ్యమైనదిగా గుర్తించబడినప్పటికీ వారు ఎన్నో సవాళ్లను కూడా ఎదుర్కొంటున్నారు.

నర్సు శాస్త్రీయ విద్య, పని ప్రదేశ్ పరిస్థితులు, శారీరక/మానసిక/నైతిక సమస్యలు, నాయకత్వం, వలసలు లాంటి సవాళ్ల నడుమ నర్సులు తమ విధులను నిర్వహిస్తున్నారు. రోగులకు స్వాస్థత చేకూర్చుతున్న నర్సుల శ్రేయస్సు, భద్రత ఆసుపత్రి యాజమాన్యాలు, రోగుల ప్రవర్తన మీద ఆధారపడి ఉంటాయి.

1974లో అధికారికంగా ప్రారంభమైన "ఇంటర్నేషనల్ నర్సెస్ డే" సందర్భంగా నర్సుల నిస్వార్థ సేవలను కొనియాడడం, వారికి కాలానుగుణంగా శిక్షణలు ఇవ్వడం, స్పెషలైజేషన్ విభాగాలను తెరవడం లాంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. కరుణ, దయ, నిస్వార్థత, అవిశ్రాంత సేవ చేస్తున్న నర్సులకు కృతజ్ఞతలు తెలియజేద్దాం, వారికి తగు రీతిలో సన్మానాలు చేద్దాం.



-మధుపాళీ
9949700037

# భారత నౌకాదళ అధిపతిగా నియమితులైన వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్

న్యూ ఢిల్లీ, మే 11:కేంద్ర ప్రభుత్వం వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్‌ను (పీవీఎస్ఎం, ఏవీఎస్ఎం, వీఎస్ఎం) నౌకాదళ తదుపరి అధిపతిగా నియమించింది. ప్రస్తుత నౌకాదళాధిపతి అడ్మిరల్ దినేష్ కుమార్ త్రిపాఠి (పీవీఎస్ఎం, ఏవీఎస్ఎం, ఎన్ఎం) 2026 మే 31న పదవీ విరమణ చేయనున్నారు.

వైస్ అడ్మిరల్ కృష్ణ స్వామినాథన్ 2025 జూలై 31 2025న పశ్చిమ నౌకాదళ కమాండ్ 34వ ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్-ఇన్-చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించారు. 1987 జూలై 01న భారత నౌకాదళంలో నియమితులైన ఆయన.. కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్ యుద్ధక్షేత్ర విభాగంలో నిపుణులు. ఆయన ఖడక్వాస్లాలోని జాతీయ డిఫెన్స్ అకాడమీ, యునైటెడ్ కింగ్‌డమ్‌లోని జాయింట్ సర్వీసెస్ కమాండ్ అండ్ స్టాఫ్ కాలేజ్ (ష్రివెన్‌హామ్), కరంజాలోని కాలేజ్ ఆఫ్ నేవల్ వార్‌ఫేర్, అమెరికాలోని యునైటెడ్ స్టేట్స్ నేవల్ వార్ కాలేజ్ (న్యూపోర్ట్) పూర్వ విద్యార్థి.

పరమ విశిష్ట సేవా మెడల్, అతి విశిష్ట సేవా మెడల్, విశిష్ట సేవా మెడల్ గ్రహీత అయిన అడ్మిరల్ స్వామినాథన్ నౌకాదళ ప్రస్థానంలో అనేక కీలక కార్యాచరణ (ఆపరేషనల్), సిబ్బంది-శిక్షణ విధులను నిర్వహించారు. క్షిపణి నౌకలైన ఐఎన్ఎస్ విద్యుత్, వినాశ్.. క్షిపణి కార్వెట్ ఐఎన్ఎస్ కులిష్.. గైడెడ్ మిస్సైల్ విధ్వంసక నౌక ఐఎన్ఎస్ మైసూర్.. విమానవాహక నౌక ఐఎన్ఎస్ విక్రమాదిత్యలకు ఆయన కమాండర్‌గా వ్యవహరించారు.

రియర్ అడ్మిరల్ హోదాకు పదోన్నతి పొందిన తర్వాత ఆయన కొచ్చిలోని దక్షిణ నౌకాదళ కమాండ్ ప్రధాన కార్యాలయంలో చీఫ్ స్టాఫ్ ఆఫీసర్‌గా (ట్రైనింగ్) పనిచేశారు. ఈ హోదాలో భారత నావికాదళం అంతటా శిక్షణ కార్యక్రమాల నిర్వహణలో ఆయన కీలక పాత్ర పోషించారు. నౌకాదళంలోని అన్ని విభాగాలలో కార్యాచరణ భద్రతను పర్యవేక్షించే 'ఇండియన్ నేవల్ సేఫ్టీ టీమ్' ఏర్పాటులో ఆయన ప్రధాన పాత్ర పోషించారు. అనంతరం 'ఫ్లాగ్ ఆఫీసర్ సీ ట్రైనింగ్'గా నౌకాదళ వర్క్-అప్ సంస్థకు ఆయన నేతృత్వం వహించారు. ఆ తర్వాత పశ్చిమ నౌకాదళానికి ఫ్లాగ్ ఆఫీసర్ కమాండింగ్‌గా నియమితులయ్యారు. నౌకాదళానికి ఖడ్గ హస్తం వంటి ఆ విభాగానికి నాయకత్వం వహించిన తర్వాత ఆయన.. 'ఫ్లాగ్ ఆఫీసర్ ఆఫ్‌షోర్ డిఫెన్స్ అడ్వైజరీ గ్రూప్', భారత ప్రభుత్వానికి ఆఫ్‌షోర్ సెక్యూరిటీ అండ్ డిఫెన్స్ సలహాదారుగా నియమితులయ్యారు.

వైస్ అడ్మిరల్ హోదాకు పదోన్నతి పొందిన తర్వాత ఆయన.. పశ్చిమ నౌకాదళ కమాండ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా, జాతీయ ప్రధాన కార్యాలయంలో కంట్రోలర్ ఆఫ్ పర్సనల్ సర్వీసెస్- చీఫ్ ఆఫ్ పర్సనల్ బాధ్యతలను నిర్వహించారు. ప్రస్తుత నియామకానికి ముందు నావికాదళ ప్రధాన కార్యాలయంలో నౌకాదళ ఉప అధిపతిగా (వైస్ చీఫ్) ఆయన పనిచేశారు.

వైస్ అడ్మిరల్ స్వామినాథన్ విద్యార్హతల విషయానికి వస్తే ఆయన ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ నుంచి బీఎస్సీ డిగ్రీని పొందారు. కొచ్చిలోని కొచ్చిన్ సైన్స్ అండ్ టెక్నాలజీ యూనివర్సిటీ నుంచి టెలికమ్యూనికేషన్స్‌లో ఎంఎస్సీ, లండన్‌లోని కింగ్స్ కాలేజీ నుంచి డిఫెన్స్ స్టడీస్‌లో ఎంఏ పట్టా పొందారు. వీటితో పాటు ముంబయి యూనివర్సిటీ నుంచి స్ట్రాటజిక్ స్టడీస్‌లో ఎంఫిల్, ఇంటర్నేషనల్ స్టడీస్‌లో పీహెచ్‌డీ పూర్తి చేశారు.

# 'స్వచ్ఛ సాగర్, సురక్షిత సాగర్ - 2026', భారత అంతర్జాతీయ సైన్స్ ఉత్సవాల ఏర్పాట్లను సమీక్షించిన డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూ ఢిల్లీ, మే 11:త్వరలో జరిగే స్వచ్ఛ సాగర్, సురక్షిత సాగర్ ప్రచార కార్యక్రమం సన్నద్ధతపై ఈ రోజు జరిగిన ఉన్నత స్థాయి సమీక్ష సమావేశానికి శాస్త్ర సాంకేతిక, భూ విజ్ఞాన శాఖ సహాయ (స్వతంత్ర హోదా) మంత్రి, ప్రధానమంత్రి కార్యాలయం, సిబ్బంది వ్యవహారాలు, ప్రజా ఫిర్యాదులు, పింఛన్లు, అణు ఇంధన, అంతరిక్ష శాఖల సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ అధ్యక్షత వహించారు. అలాగే త్వరలో జరిగే భారత అంతర్జాతీయ సైన్స్ ఉత్సవాల ఏర్పాట్లను కూడా మంత్రి విడిగా సమీక్షించారు. ఈ రెండు జాతీయ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడానికి సంస్థల మధ్య స్పష్టమైన సమన్వయం ఉండాలని, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కేంద్ర మంత్రి పిలుపునిచ్చారు.

పృథ్వీ భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో, సెప్టెంబర్ 12 నుంచి 19 వరకు దేశవ్యాప్తంగా సాగే తీరప్రాంత పరిశుభ్రత ప్రచార ప్రణాళికను సమీక్షించారు. అంతర్జాతీయ తీరప్రాంత పరిశుభ్రత దినోత్సవంతో ఈ కార్యక్రమం ముగుస్తుంది. భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ, దాని అనుబంధ సంస్థలకు చెందిన ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలతో పాటు భారత తీర రక్షణ దళం, సీమా జాగరణ్ మంచ్, పర్యావరణ సంరక్షణ గతివిధి, విభా, ఇతర భాగస్వామ్య సంస్థల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. బయోటెక్నాలజీ విభాగం కార్యదర్శి డాక్టర్ రాజేష్ ఎన్. గోఖలే, భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీ డి. సెంథిల్ పాండియన్, శాస్త్రవేత్త డాక్టర్ జగ్వీర్ సింగ్ కూడా ఇందులో పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర మంత్రిత్వ శాఖలు, విద్యా పరిశోధన సంస్థలు, జిల్లా యంత్రాంగాలు, యువజన సంఘాలు, స్థానిక వర్గాల క్రియాశీల భాగస్వామ్యంతో భారతదేశంలోని పదకొండు వేల తొంభై ఎనిమిది కిలోమీటర్ల తీరప్రాంతం వెంబడి వారం రోజుల పాటు పరిశుభ్రత కార్యక్రమాలు జరుగుతాయని మంత్రి తెలిపారు. తీరప్రాంత సంరక్షణ, సముద్ర పర్యావరణ భద్రత పట్ల పెరుగుతున్న జాతీయ నిబద్ధతను ఈ ప్రచారం ప్రతిబింబిస్తుందని ఆయన చెప్పారు.

సమావేశంలో ఒక ప్రదర్శన ద్వారా నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చ్ సమన్వయం చేసిన రెండు వేల ఇరవై ఐదు ప్రచార పురోగతిని సమీక్షించారు. తీర ప్రాంతాల నుంచి 150 టన్నుల పైగా సముద్ర వ్యర్థాలను నమోదు చేయడంలో సహాయ పడిన పౌర విజ్ఞాన వేదిక - సాగర్ యాప్ పాత్రను ఈ సమీక్షలో ప్రముఖంగా ప్రస్తావించారు.

పృథ్వీ పథకం కింద చేపట్టిన ఈ ప్రచార కార్యక్రమం శాస్త్రీయ పర్యవేక్షణను ప్రజా భాగస్వామ్యంతో అనుసంధానిస్తుందని, సముద్ర నీటి నాణ్యత అంచనా, సముద్ర వ్యర్థాల నిర్వహణ, తీరప్రాంత కోత వంటి ప్రమాదాల నివారణకు సంబంధించిన దీర్ఘకాలిక ప్రయత్నాలకు తోడ్పడుతుందని మంత్రి చెప్పారు. ఈ ప్రచార పరిధిని విస్తరించడానికి ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్, విద్యా సంస్థలు, స్వచ్ఛంద బృందాలు, పౌర సమాజ సంస్థలు మరింతగా భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

సుస్థిర నీలి ఆర్థిక వ్యవస్థ పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనికతను ప్రస్తావిస్తూ, భారత తీరప్రాంత కార్యక్రమాలు శాస్త్రీయ సంస్థలు, సాంకేతికతతో కూడిన భాగస్వామ్యంతో కొనసాగుతూ సమాజ ఆధారిత పర్యావరణ పరిరక్షణకు ఒక నమూనాగా మారుతున్నాయని డాక్టర్ జితేంద్ర సింగ్ చెప్పారు.

స్వచ్ఛ సాగర్, సురక్షిత సాగర్ ఉద్యమం దేశంలోని తీర ప్రాంతాల్లో సముద్ర వ్యర్థాలను శుభ్రం చేయడానికి, తగ్గించడానికి ఉద్దేశించిన 75 రోజుల అంతర్ మంత్రిత్వ శాఖల కార్యక్రమంగా 2022 లో ప్రారంభమైంది. అప్పటి నుంచి ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సేవకులు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, సామాజిక సంఘాల భాగస్వామ్యంతో ప్రతి ఏటా అంతర్జాతీయ తీరప్రాంత పరిశుభ్రత దినోత్సవ వారంలో భాగంగా ఈ ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. 2025లో ఈ ఉద్యమం సెప్టెంబర్ 15 నుంచి 20 వరకు తీరప్రాంతాల్లో విస్తృత ప్రజా భాగస్వామ్యంతో కొనసాగింది.

ఈ ఏడాది డిసెంబర్ మూడో వారంలో పుణెలో జరగనున్న భారత అంతర్జాతీయ సైన్స్ ఉత్సవాల ఏర్పాట్లను కూడా మంత్రి ఈ సందర్భంగా సమీక్షించారు. విజ్ఞాన శాస్త్రం, సాంకేతికత, ఆవిష్కరణలలో ప్రజల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి శాస్త్రీయ సంస్థలు, ఆవిష్కర్తలు, విద్యార్థులు, యువ పరిశోధకుల సంఖ్యను పెంచే చర్యలపై ఆయన చర్చించారు.

# రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ భూ సేకరణకు నిధులు విడుదల చెయ్యండి

## -సీఎం చంద్రబాబుకు ఎంపీ శబరి వినతి..

అమరావతి, మే 11: జిల్లా కేంద్రమైన నంద్యాల పట్టణం లోని నూనెపల్లిలో రోడ్ అండర్ బ్రిడ్జ్ నిర్మాణం కోసం భూసేకరణకు నిధులు కేటాయించవలసిందిగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరి వినతి పత్రం ఇచ్చారు. సోమవారం ఢిల్లీకి వెళ్లిన చంద్రబాబును ఎంపీ శబరి కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఎంపీ శబరి మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని నూనెపల్లి ప్రాంతంలో ఎల్ సి నెం.185 కు బదులుగా ఆర్ ఓ బి నెం 228 ఏ నిర్మించబడిందని మీ దృష్టికి తీసుకువస్తున్నామని సీఎం వివరించారు.

ఈ నూనె పల్లె ఓవర్ బ్రిడ్జి ప్రాంతంలో నిరంతరంగా భారీగా పాదచారులు అక్రమంగా ప్రవేశించడం వలన, ఈ ప్రదేశం ప్రజలకు, రైలు కార్యకలాపాలకు తీవ్రమైన, ఇబ్బందులు కలుగుతున్నాయి. భద్రత ప్రమాదంగా మారిందన్నారు. గతంలో రైల్వే అధికారులకు మంత్రులకు 2024 ఆగస్టు 29వ తేదీన, 2025 సెప్టెంబర్ ఒకటో తేదీన ఎంపీ ఆధ్వర్యంలో ఉత్తరాలు రాశాన్నన్నారు. అర్జీలకు స్పందించిన రైల్వే శాఖ అధికారులు 25 సెప్టెంబర్ 26వ తేదీన రైల్వే, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సంయుక్తంగా తనిఖీ చేపట్టారు సర్వే నిర్వహించారు.



తనిఖీ, సర్వే నివేదిక ప్రకారం, 2335 చ.మీ.ల భూసేకరణ తప్పనిసరిగా కావాలన్నారు. ఇందుకు అవసరమయ్యే ఒక రోడ్ అండర్ బ్రిడ్జిని ప్రతిపాదించడం జరిగిందని ఎంపీ సీఎం కు వివరించారు. నూనె పల్లె ప్రాంతంలో సుమారుగా 30 గ్రామాల ప్రజలు ఈ రహదారి గుండా ప్రయాణాలు సాగిస్తూ ఉంటారన్నారు. ఈ ప్రవేశాలను నివారించడానికి, ప్రజల, కార్యాచరణ భద్రతను నిర్ధారించడానికి అత్యవసరమైన నూనపల్లి ప్రాంతంలో రోడ్డు అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం, సంబంధిత 2335 చదరపు మీటర్ల భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరించాలని సీఎంను కోరారు. నంద్యాల ప్రజల కోరిక తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని అభ్యర్థించారు.

# జన సురక్ష పథకాలు 11 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వాటి ప్రభావాన్ని వివరించిన పీఎం

న్యూఢిల్లీ, మే 11:ఎన్డీయే ప్రభుత్వం 11 ఏళ్ల కిందట ప్రారంభించిన సామాజిక భద్రత, పెన్షన్ వంటి కీలక పథకాల ప్రభావం గురించి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ వివరించారు.

ప్రజలందరికీ గౌరవప్రదమైన జీవితం, భరోసా, ఆర్థిక భద్రతను కల్పించటంలో ప్రభుత్వానికున్న నిబద్ధతకు ఈ పథకాలే నిదర్శనమని పేర్కొన్నారు.

పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన, పీఎం సురక్షా బీమా యోజన క్షేత్రస్థాయిలో ప్రజల జీవితాలపై సానుకూల ప్రభావాన్ని చూపాయని, దేశంలో సామాజిక భద్రతా వ్యవస్థను బలోపేతం చేసినట్లు ప్రధానమంత్రి పేర్కొన్నారు.

వృద్ధాప్యంలో సురక్షితమైన జీవితాన్ని గడిపేందుకు అటల్ పెన్షన్ యోజన దోహదం చేసిందని, సామాజిక భద్రతను అందరికీ అందుబాటులోకి తెస్తూ, అందరినీ కలుపుకుని పోయేలా చేయటంలో ప్రభుత్వ నిబద్ధతకు ఇది నిదర్శనమని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

అటల్ పెన్షన్ యోజనలో మహిళల భాగస్వామ్యం పెరగటం, వారు ఈ పథకం ద్వారా లబ్ధి పొందటం పట్ల ప్రధాన మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ఈ పథకం విజయవంతం కావటంలో నారీ శక్తి పాత్రను ఆయన కొనియాడారు.

హ్యాష్‌ట్యాగ్ ద్వారా సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ అభిప్రాయాలను పంచుకున్నారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రధానమంత్రి ఇలా పేర్కొన్నారు.

"11 ఏళ్ల కిందట ఇదే రోజున ఎన్డీయే ప్రభుత్వం సామాజిక భద్రత, పెన్షన్ పథకాలను ప్రారంభించింది. భారతదేశ ప్రజల జీవితాల్లో గౌరవాన్ని, భరోసాను, ఆర్థిక భద్రతను తీసుకురావాలనే మా నిబద్ధతకు ఇవి నిదర్శనాలు. పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన, పీఎం సురక్షా బీమా యోజన వంటివి క్షేత్రస్థాయిలో ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకువచ్చాయని ఈ థ్రెడ్ వివరిస్తుంది.

"అటల్ పెన్షన్ యోజన ఎంతో మందికి ప్రయోజనకరంగా నిలిచింది. వృద్ధాప్యంలో సురక్షితమైన జీవితాన్ని గడిపేలా చేస్తోంది.

సామాజిక భద్రతను అందరికీ అందు బాటులోకి తీసుకురావాలనే మా నిబద్ధతకు ఈ పథకం నిదర్శనం. మహిళలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందటం ఎంతో సంతోషకరం.

అటల్ పెన్షన్ యోజన ఎంతో మందికి ఎంతో ప్రయోజనకరంగా నిలిచింది. వృద్ధాప్యంలో సురక్షితమైన జీవితాన్ని గడిపేలా చేస్తుంది. సామాజిక భద్రతను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే మా నిబద్ధతకు ఈ పథకం నిదర్శనం.

ఎంతో మహిళలు ఈ పథకం ద్వారా లబ్ధి పొందటం సంతోషాన్నిచ్చింది.

# బహుళ లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం గల సాంకేతికతతో కూడిన అధునాతన అగ్ని క్షిపణి గగనతల పరీక్షను విజయవంతంగా నిర్వహించిన భారత్

న్యూ ఢిల్లీ, మే 11: బహుళ లక్ష్యాలను ఛేదించే సామర్థ్యం గల (ఎంఐఆర్‌వీ) సాంకేతికతతో కూడిన అధునాతన అగ్ని క్షిపణిని భారత్ విజయవంతంగా పరీక్షించింది. ఒడిశాలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి మే 8, 2026న ఈ ప్రయోగాన్ని నిర్వహించింది. ఈ క్షిపణిని వివిధ వార్‌హెడ్‌లతో పరీక్షించగా, అవి హిందూ మహాసముద్ర ప్రాంతంలోని పలు భౌగోళిక ప్రాంతాల్లోని వేర్వేరు లక్ష్యాలను ఖచ్చితత్వంతో చేరుకున్నాయి.

క్షిపణి ప్రయోగ పర్యవేక్షణకు భూఉపరితలంపైనున్న కేంద్రాలతో పాటు సముద్రంలోని నౌకల ద్వారా టెలిమెట్రీ, ట్రాకింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేశారు. క్షిపణి నింగిలోకి ఎగసిన సమయం నుంచి బహుళ లక్ష్యాలను చేరేవరకు ప్రయాణించిన మార్గాన్ని ఈ వ్యవస్థలు పర్యవేక్షించాయి. ఈ ప్రయోగం నిర్దేశించుకున్న లక్ష్యాలను విజయవంతంగా చేరుకున్నట్లు ధ్రువీకరించాయి.

ఈ విజయవంతమైన పరీక్షతో ఒకే క్షిపణి వ్యవస్థ ద్వారా వ్యూహాత్మకంగా బహుళ లక్ష్యాలను ఛేదించగల సామర్థ్యాన్ని భారత్ మరోసారి నిరూపించుకుంది. దేశవ్యాప్తంగా వివిధ పరిశ్రమల సహకారంతో డీఆర్‌డీఓ ప్రయోగశాలలో ఈ క్షిపణిని అభివృద్ధి చేశారు. డీఆర్‌డీఓ సీనియర్ శాస్త్రవేత్తలు, భారత సైనికాధికారులు ఈ ప్రయోగాన్ని స్వయంగా వీక్షించారు.

విజయవంతమైన ఈ ప్రయోగం పట్ల డీఆర్‌డీఓ, భారత సైన్యం, పరిశ్రమ వర్గాలను రక్షణ శాఖ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ అభినందించారు. పెరుగుతున్న భద్రతా సవాళ్ల దృష్ట్యా ఈ క్షిపణి ప్రయోగం దేశ రక్షణ సన్నద్ధతకు తిరుగులేని బలాన్ని చేకూరుస్తుందన్నారు.

# పెరుగుతున్న ప్రభుత్వ పాఠశాలల అడ్మిషన్లు

## -ఎంఈఓ లలిత కుమారి



అమరావతి, మే 11: ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చదివించేందుకు తల్లిదండ్రులు ముందుకు వస్తున్నారని, ఆ సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతుందని మండల విద్యాశాఖ రెండవ అధికారి పుసులూరి లలిత కుమారి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడి పిలుస్తోంది కార్యక్రమం మండలంలోని మతుకుమల్లి గ్రామంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లలిత కుమారి పాల్గొని ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి 6 గురు విద్యార్థులను జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేర్పించారు.

ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల పెంపే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, ఆధునిక బోధన, అధునాతన సామగ్రి, అర్హత కలిగిన ఉపాధ్యాయులున్నారన్నారు. విద్యార్థిమిత్ర ద్వారా ఉచితంగా కిట్లను పంపిణీ చేయడంతో పాటు మధ్యాహ్న భోజనంలో పౌష్టికాహారం అందిస్తున్నామన్నామని ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని, అందుకు ఈ సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన 10వ తరగతి విద్యార్థుల ఫలితాలే ఇందుకు నిదర్శనమన్నారు. ఎంఈఓతో పాటు పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ రామాంజమ్మ, ప్రధానోపాధ్యాయులు కె.మురళీమోహన్, ఉపాధ్యాయులు కె.వీణపాణి, ఎన్.భ్రమరాంబ, కోటేశ్వరరావు, రామకృష్ణ, జి.వెంకట సౌజన్య,శంకర్, ఏడుకొండలు ఉన్నారు.

# విభజన హామీలు, పోలవరంపై కీలక చర్చలు

అమరావతి, మే 11: కేంద్ర హోంమంత్రి అమిత్ షా తో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం కీలక భేటీ నిర్వహించారు. రాష్ట్ర విభజన హామీల అమలు, అమరావతి అభివృద్ధి, పోలవరం ప్రాజెక్టు నిధులు వంటి అంశాలపై ఇరువురు చర్చించినట్లు సమాచారం. ఈ సమావేశం రాజకీయ, పరిపాలనా వర్గాల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.

రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీల్లో ఇంకా పెండింగ్‌లో ఉన్న అంశాలను ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు కేంద్ర హోంమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. అలాగే అమరావతిలో మరిన్ని కేంద్ర సంస్థలను ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రతిపాదనలు అందించినట్లు సమాచారం.

అమరావతి నిర్మాణ పనుల పురోగతిని వివరిస్తూ కేంద్రం నుంచి మరింత ఆర్థిక సహకారం అందించాలని చంద్రబాబు కోరినట్లు తెలిసింది. అలాగే కీలకమైన పోలవరం ప్రాజెక్టు నిధుల విడుదలలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని అమిత్ షాను అభ్యర్థించినట్లు సమాచారం.

# నెలరోజుల పాటు మజ్జిగ పంపిణీ

అమరావతి, మే 11:స్థానిక64వ డివిజన్ టీడీపీ అధ్యక్ష, కమిటీ ఆధ్వర్యంలో నెలరోజుల పాటు మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా కండ్రికలో టీడీపీ కార్యాలయంలో అధ్యక్షుడు కె.రవికుమార్ కమిటీ సభ్యులు సోమవారం పాదాచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ప్రభుత్వ విప్,పార్టీ ఉపాధ్యక్షుడు, సెంట్రల్ నియోజకవర్గ శాసనసభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు ఆదేశాల మేరకు మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని రవికుమార్ పేర్కొన్నారు.

రాష్ట్రంలో ఎండలు తీవ్రంగా మండిపోతున్న నేపథ్యంలో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటానికి చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు మజ్జిగ, మంచినీరు అందజేయడం జరుగుతుందని అన్నారు. కూటమి ప్రభుత్వం వడగాల్పులపై ఎప్పటికప్పుడు అలర్టు జారీ చేస్తూ, ఉష్ణోగ్రత అంచనాలను ప్రజలకు మెసేజ్‌ల ద్వారా తెలియజేస్తూ, ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అవసరమైన సూచనలు అందిస్తున్నదని ఆయన పేర్కొన్నారు. చలివేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రయాణికులు,కార్మికులు, ఆటో డ్రైవర్లు, రోడ్డుపై పనిచేసే మహిళలకు,వృద్ధులకు, దివ్యాంగులకు మజ్జిగ, చల్లని తాగునీరు అందిస్తున్నామని తెలిపారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనంతో ప్రభుత్వ సచివాలయాల్లో చోరీలు

### -ఇంజినీరింగ్ విద్యార్థి అరెస్ట్
### -రూ.8.10 లక్షల దొంగసొత్తు స్వాధీనం

చిత్తూరు, మే 11:ఆన్‌లైన్ బెట్టింగ్‌కు బానిసై ప్రభుత్వ సచివాలయాలను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్న ఇంజినీరింగ్ విద్యార్థిని పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుండి



రూ.8,10,400 విలువైన 30 ప్రింటర్లు, మూడు ల్యాప్‌టాప్‌లు, ఒక ద్విచక్ర వాహనం, నేరాలకు ఉపయోగించిన కట్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో మొత్తం 18 కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.

చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు నగరి ఇన్‌చార్జ్ డీఎస్పీ జె. రామ్‌బాబు పర్యవేక్షణలో కార్వేటినగరం సీఐ, ఎస్.ఆర్.పురం ఎస్ఐ, సిబ్బంది ఆదివారం ఎస్.ఆర్.పురం పోలీస్ స్టేషన్ పరిధిలోని చిత్తూరు?తిరుపతి ప్రధాన రహదారిపై మఠం క్రాస్ వద్ద వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా, అతడు పలు ప్రభుత్వ సచివాలయాల్లో చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడు. అరెస్ట్ అయిన నిందితుడు సి. మహేష్‌బాబు (22), తండ్రి దొరబాబు, ఎన్.ఆర్.పురం మండలం కన్యాకాపురం గ్రామానికి చెందినవాడు.

ప్రస్తుతం తిరుపతిలో నివాసం ఉంటున్నాడు. అతని వద్ద ఒక ప్రింటర్ ఉండటంతో పోలీసులు అనుమానం వ్యక్తం చేసి విచారణ చేపట్టారు. అనంతరం అతని వద్ద నుండి 30 దొంగిలించిన ప్రింటర్లు, మూడు ల్యాప్‌టాప్‌లు, గ్లామర్ మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు.

పోలీసుల విచారణలో నిందితుడు చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లోని ప్రభుత్వ సచివాలయాలను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడినట్లు వెల్లడైంది. రాత్రి వేళల్లో కార్యాలయాల తలుపులను కట్టర్‌తో పగులగొట్టి లోపలికి ప్రవేశించి ప్రింటర్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను దొంగిలించేవాడని పోలీసులు తెలిపారు. దొంగిలించిన వస్తువులను తక్కువ ధరలకు విక్రయించి వచ్చిన డబ్బును ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, విలాసవంతమైన జీవనానికి ఖర్చు చేసేవాడని విచారణలో బయటపడింది.

దొంగిలించిన ప్రింటర్లు, ల్యాప్‌టాప్‌లను ఓ ఎల్ ఎక్స్ యాప్ లో సెకండ్‌హ్యాండ్ వస్తువులుగా అప్‌లోడ్ చేసి అమ్మేవాడని, తక్కువ ధరకు లభించడంతో కొనుగోలుదారులు సులభంగా కొనుగోలు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. చిత్తూరు జిల్లాలోని ఎన్.ఆర్.పురం, వేదురుకుప్పం, గుడిపాల, జీడీ నెల్లూరు మండలాల్లోని పలు గ్రామ సచివాలయాల్లో అతడు చోరీలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. తిరుపతి జిల్లాలోని పాకాల, వడమాలపేట మండలాలు, ఎం.ఆర్.పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో కూడా కేసులు నమోదయ్యాయి. అలాగే అన్నమయ్య జిల్లా వీరేరు మండలంలోని దొడ్డిపల్లి సచివాలయంలో జరిగిన చోరీలో కూడా అతని ప్రమేయం ఉన్నట్లు నిర్ధారించారు.

పోలీసులు స్వాధీనం చేసుకున్న వాటిలో రూ.6,50,544 విలువైన 30 హెచ్‌పీ, ఎప్సన్ కంపెనీల ప్రింటర్లు, రూ.1,59,866 విలువైన మూడు ల్యాప్‌టాప్‌లు ఉన్నాయి. మొత్తం దొంగసొత్తు విలువ సుమారు రూ.8.10 లక్షలుగా అంచనా వేశారు. నిందితుడు ఇంజినీరింగ్ విద్యార్థి అయినప్పటికీ ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనంతో సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఈ చోరీలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.

ప్రభుత్వ కార్యాలయాలను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలు చేయడం ద్వారా అంతర్‌జిల్లా స్థాయిలో నేరాలకు పాల్పడుతున్నాడని వెల్లడించారు. ఈ కేసులను ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన కార్వేటినగరం సీఐ వై. హనుమంతప్ప, ఎస్.ఆర్.పురం ఎస్ఐ వి. సుమన్, పోలీసు సిబ్బంది లోకనాథం, రాజశేఖర్, బాలయ్య, శరత్, వజ్రవేలు, యువరాజ్‌లను జిల్లా ఎస్పీ అభినందించారు.

# క్రీడల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### -ప్రపంచ స్థాయి ప్రమాణాలతో కర్నూలు స్టేడియం అభివృద్ధి..
### -స్పోర్ట్స్ హాస్టల్‌ను కర్నూలులోనే కొనసాగిస్తాం: మంత్రి టీజీ భరత్..
### -యువత ప్రతిరోజూ క్రీడల్లో పాల్గొనాలి: ఎంపీ బస్తిపాటి నాగరాజు..

కర్నూలు మే 11: క్రీడల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, కర్నూలు స్టేడియాన్ని ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్నట్లు రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తా తెలిపారు. సోమవారం కర్నూలు నగరంలోని సమ్మర్ కోచింగ్ క్యాంపును మంత్రి టీజీ భరత్, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, శాప్ చైర్మన్ రవి నాయుడు కలిసి సందర్శించారు.

ఈ సందర్భంగా క్యాంపులో శిక్షణ పొందుతున్న క్రీడాకారులతో మంత్రి ముచ్చటించి వారి ప్రతిభను అభినందించారు. గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడాకారులను ప్రోత్సహించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. యువత ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవరుచుకోవాలంటే ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ వ్యాయామం, క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. వ్యాయామం చేసే వారు శారీరకంగా, మానసికంగా మరింత ఉత్సాహంగా ఉండి తమ పనులను అధిక సామర్థ్యంతో నిర్వహించగలరని తెలిపారు.

కర్నూలు స్పోర్ట్స్ హాస్టల్‌ను ఎక్కడికీ తరలించే ఆలోచన లేదని మంత్రి స్పష్టం చేశారు. హాస్టల్‌ను మరింత ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కర్నూలు స్టేడియంలో ప్రపంచ స్థాయి క్రీడా వసతులు కల్పించే దిశగా ఇప్పటికే చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. గరంలోని పార్కులను కూడా వ్యాయామానికి అనుకూలంగా అభివృద్ధి చేస్తున్నామని, యువత క్రీడలను కెరీర్‌గా తీసుకుంటే ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందుతుందని మంత్రి హామీ ఇచ్చారు. టీజీవీ గ్రూప్ తరఫున దశాబ్దాలుగా క్రీడాకారులను ప్రోత్సహిస్తూ వస్తున్నామని, ప్రతిభ కలిగిన యువతకు అవసరమైన సహకారం అందిస్తున్నామని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాలను సందర్శించినప్పటికీ కర్నూలులో ఉన్న స్థాయి క్రీడా వసతులు మరెక్కడా కనిపించలేదని శాప్ చైర్మన్ రవి నాయుడు చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ఎన్నికలకు ముందు మంత్రి టీజీ భరత్‌తో కలిసి స్టేడియాన్ని పరిశీలించినప్పుడు ఇచ్చిన హామీల మేరకు ప్రస్తుతం అత్యాధునిక సింథటిక్ ట్రాక్ ఏర్పాటు కావడం జరిగిందన్నారు.

క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి తన వంతు సహకారంగా ఎంపీ నిధుల నుంచి రూ.15 లక్షలు కేటాయించినట్లు వెల్లడించారు. యువత చదువుతో పాటు క్రీడలపైనా ఆసక్తి పెంపొందించుకోవాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు.

50 సమ్మర్ క్యాంపులతో యువతకు అవకాశం..

శాప్ చైర్మన్ రవి నాయుడు మాట్లాడుతూ, సమ్మర్ స్పోర్ట్స్ క్యాంపులు యువత ప్రతిభను వెలికితీసే గొప్ప వేదికలని పేర్కొన్నారు. ఈ క్యాంపుల ద్వారా అనేక మంది క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా శాప్ ఆధ్వర్యంలో 50 సమ్మర్ క్యాంపులు నిర్వహిస్తుండగా, కర్నూలు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో మరో 25 క్రీడా శిబిరాలు కొనసాగుతున్నాయని చెప్పారు.

ప్రతి క్యాంపుకు రూ.10 వేల చొప్పున నిధులు కేటాయించి, క్రీడాకారులకు చిక్కీ, ప్రత్యేక డైట్ సదుపాయాలు అందిస్తున్నామని వెల్లడించారు. ప్రస్తుతం యువత చిన్న విషయాలకే నిరుత్సాహానికి గురవుతున్న తరుణంలో గెలుపోటములను సమానంగా స్వీకరించే మనోధైర్యం కేవలం క్రీడల ద్వారానే వస్తుందని పేర్కొన్నారు. క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ఎంతో దోహదపడతాయని అన్నారు.

అనంతరం సమ్మర్ కోచింగ్ క్యాంపులో పాల్గొంటున్న క్రీడాకారుల మెరుగైన శిక్షణ కోసం అవసరమైన క్రీడా పరికరాలను మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, శాప్ చైర్మన్ రవి నాయుడు క్యాంప్ ఇన్‌చార్జిలకు అందజేశారు. యువత క్రీడల్లో రాణించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# సామాజిక భద్రతనిచ్చే 3 పథకాలు- “ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై) ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై)... అటల్ పెన్షన్ యోజన” (ఏపీవై)లకు 11 ఏళ్లు పూర్తి

న్యూఢిల్లీ, మే 11:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2015 మే 9వ తేదీన శ్రీకారం చుట్టిన మూడు సామాజిక భద్రత పథకాలకు నేటితో 11 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ మేరకు “ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై), ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై), అటల్ పెన్షన్ యోజన'' (ఏపీవై) పథకాలు దేశంలోని పేదలకు... ముఖ్యంగా అణగారిన, బలహీన వర్గాలకు స్వల్ప రుసుముతో ఆర్థిక భద్రత కల్పించాలన్న ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేరుస్తున్నాయి. అదే సమయంలో జీవితంలోని అనిశ్చితి నుంచి పౌరులకు రక్షణ సహా దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వం కల్పించడం ద్వారా బీమా, పెన్షన్ రంగాలను విస్తృతం చేయడం కూడా ఈ ప్రధాన పథకాల ధ్యేయం.

ఈ నేపథ్యంలో కేంద్ర ఆర్థిక-కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ ఈ మూడు జన సురక్ష పథకాల మార్గదర్శక సూత్రాలను ప్రస్తావిస్తూ- “స్వల్ప రుసుముతో బీమా, పెన్షన్ ప్రయోజనం కల్పించే దిశగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ‘పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన’, ‘పీఎం సురక్ష బీమా యోజన’, ‘అటల్ పెన్షన్ యోజన’లను ప్రారంభించారు'' అని గుర్తుచేశారు.

ఈ మూడు పథకాలకు ఈ రోజుతో 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా వీటికి సంబంధించిన కొన్ని గణాంకాలను ఆమె ఉటంకించారు. ఈ మేరకు “పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై, ఏపీవై”ల కింద వరుసగా 27 కోట్లు, 58 కోట్లు, 9 కోట్ల మంది వంతున లబ్ధిదారులు నమోదు చేసుకున్నారని వెల్లడించారు.

ఈ క్రమంలో ‘పీఎంజేజేబీవై’ కింద అందిన అభ్యర్థలనపై 10.7 లక్షల కుటుంబాలకు రూ.21,500 కోట్లకు పైగా పరిహారం చెల్లించినట్లు పేర్కొన్నారు.

అలాగే, ‘పీఎంఎస్‌బీవై’ కింద 1.84 లక్షల కుటుంబాలకు రూ.3,660 కోట్లకుపైగా పరిహారం అందిందని శ్రీమతి సీతారామన్ తెలిపారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ- “మూడు జన సురక్ష పథకాల 11వ వార్షికోత్సవ తరుణంలో బ్యాంకులు, బీమా సంస్థల క్షేత్రస్థాయి సిబ్బంది సహా వీటిని విజయవంతం చేయడంలో అంకితభావం ప్రదర్శించిన భాగస్వామ్య సంస్థలన్నిటినీ నా హృదయపూర్వక అభినందనలు తెలుపుతున్నాను'' అని ఆమె పేర్కొన్నారు.

అనంతరం కేంద్ర ఆర్థికశాఖ సహాయ మంత్రి శ్రీ పంకజ్ చౌదరి మాట్లాడుతూ- “నిరుపేదలకు బీమా సదుపాయంతోపాటు పెన్షన్ ద్వారా చేయూతనివ్వడమే ఈ పథకాల లక్ష్యం. వీటికింద లబ్ధిదారుల నమోదు, అభ్యర్థనల పరిష్కార ప్రక్రియ డిజిటలీకరణ-సరళీకరణలపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి సారించింది. ఇందులో భాగంగా జన సురక్ష ఆన్‌లైన్ పోర్టల్‌ను ప్రారంభించడంతో పేదలు బ్యాంకు శాఖలు లేదా తపాలా ఆఫీసులకు వెళ్లే అవసరం లేకుండా సులువుగా నమోదు చేసుకోవడం సాధ్యమైంది. మరోవైపు అభ్యర్థనల పరిష్కార ప్రక్రియను కూడా డిజిటలీకరించడంతో సమస్యలు సత్వరం తీరుతున్నాయి. తద్వారా ఆత్మీయులను కోల్పోయిన కుటుంబాలకు అత్యంత అవసర పరిస్థితుల నడుమ సత్వర, సకాల సహాయం అందుతోంది'' అని చెప్పారు.

మూడు సామాజిక భద్రత పథకాలు... “ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై), ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై), అటల్ పెన్షన్ యోజన'' (ఏపీవై)ల 11వ వార్షికోత్సవం నేపథ్యంలో వీటికి సంబంధించిన ముఖ్యాంశాలతోపాటు స్వల్ప రుసుముతో ప్రజలకు బీమా, భద్రత (జన సురక్ష) కల్పించడంలో అవి సాధించిన విజయాలను ఒకసారి మననం చేసుకుందాం:

ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన (పీఎంజేజేబీవై):

రోజుకు కేవలం రూ.2 వంతున రుసుముతో జీవిత బీమా రక్షణ లభించే ఈ పథకం కింద నమోదైన వ్యక్తి దురదృష్టవశాత్తూ మరణిస్తే, ఆ కుటుంబానికి ?2 లక్షలదాకా పరిహారం లభిస్తుంది.

ఈ పథకం విశిష్టత: స్వల్ప రుసుముతో లభించే ఈ బీమా రక్షణను ఏటా నవీకరించుకోవాల్సి ఉంటుంది. ఇందుకు అవసరమైన అనుమతులు, ఆమోదాలతో భారత జీవిత బీమా (ఎల్ఐసీ) సంస్థతోపాటు ఈ నిబంధన కింద ఇదే ప్రయోజనం కల్పించే ఇతర జీవిత బీమా కంపెనీలు, తపాలా ఆఫీసులతో ఒప్పందం ద్వారా ఇది అందుబాటులో లేదా నిర్వహణలో ఉంటుంది. ఈ పథకం అమలులో పాలుపంచుకునే బ్యాంకులు, తపాలా కార్యాలయాలకు తమ చందాదారుల కోసం ఈ పథకాన్ని అమలు చేయడం లేదా ఏదైనా జీవిత బీమా కంపెనీతో ఒప్పందం కుదుర్చుకోగల స్వేచ్ఛ ఉంటుంది.

అర్హత నిబంధనలు: పాలుపంచుకునే బ్యాంకులు, తపాలా కార్యాలయాల్లో 18 నుంచి 50 ఏళ్ల వయస్సు గల వ్యక్తిగత బ్యాంకు లేదా తపాలా ఆఫీసు ఖాతాదారులు ఈ పథకం కింద రక్షణ పొందవచ్చు. ఇందుకోసం ఆటో డెబిట్ సదుపాయం వినియోగానికి సమ్మతి తెలుపవచ్చు. ఒక వ్యక్తికి ఒకటి లేదా వేర్వేరు బ్యాంకులు, పోస్టాఫీసులలో ఒకటికన్నా ఎక్కువ ఖాతాలుంటే, సదరు వ్యక్తి కేవలం ఒక బ్యాంకు లేదా పోస్టాఫీసు ఖాతా ద్వారా మాత్రమే ఈ పథకంలో చేరేందుకు అర్హుడవుతాడు.

నమోదు కాలం: ఈ పథకం కింద బీమా రక్షణ ఏటా జూన్ 1 నుంచి మరుసటేడాది మే 31 దాకా అమలులో ఉంటుంది. ఇందుకోసం నిర్దేశిత ఫారంలో నిర్దేశిత బ్యాంకు లేదా పోస్టాఫీసు ఖాతా నుంచి ఆటో డెబిట్ ద్వారా రుసుము చెల్లించే అవకాశం ఖాతాదారులకు ఉంది.

రుసుము: ఈ పథకంలోని ప్రతి సభ్యుడూ ఏటా రూ.436 వంతున రుసుము చెల్లించి నమోదు చేసుకోవాలి. ఆ సమయంలోనే వారి సమ్మతికి అనుగుణంగా ఖాతాదారు బ్యాంకు లేదా పోస్టాఫీసు ఖాతా నుంచి ‘ఆటో డెబిట్’ సౌకర్యంతో రుసుము ఒకే విడతలో బీమా సంస్థకు జమ అవుతుంది. ఈ మేరకు కింద వివరించినట్లుగా దామాషా ప్రకారం రుసుము చెల్లింపు ద్వారా భవిష్యత్ రక్షణ కోసం ఆలస్యంగానూ నమోదు చేసుకోవచ్చు.

ప్రయోజనాలు: చందాదారు దురదృష్టవశాత్తూ మరణిస్తే వారి కుటుంబానికి రూ.2 లక్షల పరిహారం లభిస్తుంది. అయితే, పథకం కింద నమోదు తేదీ నుంచి 30 రోజుల తర్వాత ఇది అమలులోకి వస్తుంది.

విజయాలు: పీఎంజేజేబీవై కింద 29.04.2026 నాటికి 27.43 కోట్ల మందికి పైగా లబ్ధిదారులు నమోదు కాగా, 10,75,625 అభ్యర్థనలపై రూ.21,512.50 కోట్ల మేర పరిహారం చెల్లించారు.

ఈ పథకం కింద 29.04.2026 నాటికి నమోదు చేసుకున్నవారిలో 12.72 కోట్లమంది మహిళలు ఉండగా, ప్రధానమంత్రి జన్‌ధన్ ఖాతాల ద్వారా 8.09 కోట్ల మంది నమోదయ్యారు.

ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పీఎంఎస్‌బీవై):

ఈ పథకం కింద 18 నుంచి 70 ఏళ్ల మధ్య వయస్కులు నెలకు కేవలం రూ.2 వంతున రుసుముతో నమోదు చేసుకోవచ్చు. వీరు ఏదైనా ప్రమాదంలో మరణించినా, వైకల్యం సంభవించినా 2 లక్షల దాకా బీమా రక్షణ లభిస్తుంది. కాళ్లూచేతులు, కళ్లు వంటి అవయవ నష్టం పాక్షికంగా లేదా పూర్తిగా సంభవించినా దీనికింద రక్షణ ఉంటుంది.

ఈ పథకం విశిష్టత: పీఎంఎస్‌బీవై కింద ఏడాదిపాటు జీవిత బీమా రక్షణ లభిస్తుంది. కాబట్టి, ప్రతి సంవత్సరం నవీకరించుకోవాలి. ఈ పథకాన్ని తగిన అనుమతులు, ఆమోదాలతో ప్రభుత్వ రంగ సార్వత్రిక బీమా కంపెనీలు బ్యాంకులు, పోస్టాఫీసులతో ఒప్పందం కుదుర్చుకుని, ఇలాంటి నిబంధనల ఆధారంగా సేవలందించే ఇతర సాధారణ బీమా కంపెనీల ద్వారా పాలసీలను విక్రయిస్తారు లేదా నిర్వహిస్తారు. ఇందులో పాలుపంచుకునే బ్యాంకులు, పోస్టాఫీసులకు తమ చందాదారుల కోసం ఈ పథకం అమలులో ఏదైనా బీమా కంపెనీని నియమించుకునే స్వేచ్ఛ ఉంటుంది.

అర్హత నిబంధనలు: దీని అమలులో పాలుపంచుకునే బ్యాంకులు, పోస్టాఫీసులలో 18 నుంచి 70 ఏళ్ల మధ్య వయస్కులైన వ్యక్తిగత బ్యాంకు లేదా పోస్టాఫీసు ఖాతాదారులు ఈ పథకంలో చేరడానికి లేదా ఆటో డెబిట్‌ను ప్రారంభించడానికి తమ సమ్మతి తెలుపవచ్చు. ఒక వ్యక్తికి ఒకటి లేదా వేర్వేరు బ్యాంకులు, పోస్టాఫీసులలో ఒకటికన్నా ఎక్కువ ఖాతాలుంటే వారు కేవలం ఒక బ్యాంకు లేదా పోస్టాఫీసు ఖాతా ద్వారా మాత్రమే ఈ పథకంలో చేరడానికి అర్హులు.

నమోదు కాలం: ఈ పథకం కింద బీమా రక్షణ ఏటా జూన్ 1 నుంచి మరుసటేడాది మే 31 దాకా ఏడాది కాలానికి అమలులో ఉంటుంది. ఇందుకోసం నిర్దేశిత ఫారంలో నిర్దేశిత బ్యాంకు లేదా పోస్టాఫీసు ఖాతా నుంచి ఆటో డెబిట్ ద్వారా రుసుము చెల్లించే అవకాశం వ్యక్తిగత ఖాతాదారులకు ఉంటుంది.

రుసుము: ఈ పథకంలోని ప్రతి సభ్యుడు ఏటా రూ.20 వంతున చెల్లించాలి. పథకంలో నమోదు చేసుకునే సమయంలో ఇచ్చిన ఎంపిక ప్రకారం, ఖాతాదారుని బ్యాంకు లేదా పోస్టాఫీసు ఖాతా నుంచి ‘ఆటో డెబిట్’ సౌకర్యం ద్వారా రుసుమును ఒకేసారి స్వీకరిస్తారు.

రెండు కళ్లూ పూర్తిగా.. కోలుకోలేని విధంగా కోల్పోవడం లేదా రెండు చేతులు/కాళ్లు ఉపయోగించలేని దుస్థితి లేదా ఒక కంటి చూపు కోల్పోవడం, చేయి లేదా కాలు కూడా ఉపయోగించుకోలేని దుస్థితి.

ఒక కంటి చూపు పూర్తిగా, కోలుకోలేని విధంగా కోల్పోవడం లేదా ఒక చేయి లేదా కాలు ఉపయోగించుకోలేని దురవస్థ

విజయాలు: పీఎంబీఎస్‌వై కింద 29.04.2026 నాటికి 58.09 కోట్ల మందికి పైగా లబ్ధిదారులు నమోదు కాగా, 1,84,662 అభ్యర్థనలపై రూ.3,667.52 కోట్ల మేర పరిహారం చెల్లించారు.

ఈ పథకం కింద 29.04.2026 నాటికి నమోదు చేసుకున్నవారిలో 27.45 కోట్లమంది మహిళలు ఉండగా, ప్రధానమంత్రి జన్‌ధన్ ఖాతాల ద్వారా 19.30 కోట్ల మంది నమోదయ్యారు.

భారతీయులందరికీ... ముఖ్యంగా పేదలు, అణగారిన వర్గాలు, అసంఘటిత కార్మికులకు సార్వత్రిక సామాజిక భద్రత వ్యవస్థ ఏర్పరిచే లక్ష్యంతో అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) ప్రారంభమైంది. అసంఘటిత రంగంలోని కార్మికులకు ఆర్థిక భద్రత, భవిష్యత్ అవసరాలు తీర్చగలిగేలా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమమిది. తదనుగుణంగా జాతీయ పెన్షన్ వ్యవస్థ (ఎన్‌పీఎస్) పరిపాలన, సంస్థాగత స్వరూపంలో భాగంగా పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ (పీఎఫ్‌ఆర్‌డీఏ) ‘ఏపీవై’ పథకాన్ని నిర్వహిస్తోంది.

అర్హత: దేశంలో 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్కులు, ఆదాయపు పన్ను పరిధిలోకి రాని బ్యాంకు ఖాతాదారులందరికీ ఈ పథకం అందుబాటులో ఉంటుంది. తామెంచుకునే పెన్షన్ దామాషా మేరకు వారు చందా మొత్తం చెల్లించాల్సి ఉంటుంది.

ప్రయోజనాలు: చందాదారులకు హామీ ఇచ్చిన మేరకు కనీస నెలవారీ పెన్షన్ రూ.1000 లేదా రూ.2000 లేదా రూ.3000 లేదా రూ.4000 లేదా పథకంలో చేరేవారి చెల్లింపుల ప్రాతిపదికన 60 ఏళ్లు దాటిన తర్వాత రూ.5000 దాకా పెన్షన్ లభిస్తుంది.

పథకం ప్రయోజనాల పంపిణీ: నెలవారీ పెన్షన్‌దారు కీర్తిశేషులైతే ఆ తర్వాత అతని/ఆమె జీవిత భాగస్వామికి పెన్షన్ లభిస్తుంది. ఆ మేరకు చందాదారుకు 60 ఏళ్లు నిండేనాటికి జమ అయిన పెన్షన్ నిధిని వారు ప్రతిపాదించిన వ్యక్తికి అందజేస్తారు.

ఒకవేళ చందాదారు అకాల (60 ఏళ్ల నిండకముందే) మరణం పాలైతే, వారు 60 ఏళ్లకు చేరుకునేదాకా మిగిలిన అర్హత కాలానికి, వారి జీవిత భాగస్వామి ఏపీవై ఖాతాకు చెల్లింపును కొనసాగించవచ్చు.

చెల్లింపు వ్యవధి: చందాదారులు ఏపీవై ఖాతాకు నెల, త్రైమాసిక, అర్ధ సంవత్సర వ్యవధులలో తమ చందాను జమచేయవచ్చు.

పథకం నుంచి ఉపసంహరణ: ప్రభుత్వ సంయుక్త చెల్లింపు సహా దానిపై రాబడి లేదా వడ్డీని మినహాయించుకున్న అనంతరం మాత్రమే... కొన్ని షరతుల మేరకు చందాదారులు ఏపీవై నుంచి స్వచ్ఛందంగా వైదొలగవచ్చు.

పథకం ప్రగతి: ఈ పథకం కింద లక్షల సంఖ్యలో చందాదారులు నమోదు చేసుకున్నారు.

వీరిలో మహిళలు 49 శాతం దాకా ఉన్నారు.

విజయాలు: దేశంలో ఏపీవై కింద 30.04.2026 నాటికి 9.04 కోట్ల మందికి పైగా లబ్ధిదారులు నమోదయ్యారు.

# వైద్య సేవల్లో కర్నూలుకు ‘ఏ’ గ్రేడ్

### -హాస్పిటల్ యాక్టివిటీ ఇండికేటర్..
### -గణనలో జిల్లా ప్రతిభ
### -ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు సహా పలు ఆసుపత్రులకు అత్యుత్తమ రేటింగ్

కర్నూలు మే 11: కర్నూలు జిల్లాలో వైద్య సేవలు మరింత మెరుగుదల దిశగా అడుగులు వేస్తున్నాయి. సెకండరీ హెల్త్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరును అంచనా వేస్తూ నిర్వహించిన హాస్పిటల్ యాక్టివిటీ ఇండికేటర్ (ఊంఎ) గణనలో జిల్లా సమగ్రంగా ‘ం’ గ్రేడ్ సాధించింది.

ఈ మేరకు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి సోమవారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు. 2025 ఏప్రిల్ నుంచి 2026 మార్చి వరకు నిర్వహించిన గణనలో నిర్దేశించిన లక్ష్యాలను కర్నూలు జిల్లా ఆసుపత్రులు సమర్థవంతంగా చేరుకోవడంతో ఈ గుర్తింపు లభించినట్లు కలెక్టర్ తెలిపారు.

ముఖ్యంగా ఓపీ సేవలు, ఐపీ చికిత్సలు, ప్రసవాలు, శస్త్రచికిత్సలు, బెడ్ ఆక్యుపెన్సీ తదితర కీలక సూచికల్లో మెరుగైన పనితీరు కనబరిచినట్లు పేర్కొన్నారు.

జిల్లాలోని మాతా శిశు సంరక్షణ ఆసుపత్రి (ఆదోని), ప్రాంతీయ వైద్యశాల (ఎమ్మిగనూరు), సామాజిక ఆరోగ్య కేంద్రాలు కోడుమూరు, వెల్దుర్తి, పత్తికొండ, ఆలూరు ఆసుపత్రులకు ‘ం’ గ్రేడ్ లభించిందని కలెక్టర్ వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ వైద్య సేవలు మెరుగుపడుతున్నాయనే దానికి ఈ ఫలితాలు నిదర్శనమని ఆమె పేర్కొన్నారు.

అదేవిధంగా ఓర్వకల్ సామాజిక ఆరోగ్య కేంద్రానికి ‘ః’ గ్రేడ్ లభించిందని తెలిపారు. ప్రస్తుతం ఆ ఆసుపత్రిలో మౌలిక వసతులు, సేవల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించామని, రాబోయే రోజుల్లో ఓర్వకల్ ఆసుపత్రిని కూడా ‘ం’ గ్రేడ్ స్థాయికి తీసుకెళ్లేందుకు అన్ని చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతున్న నేపథ్యంలో వైద్య సేవల నాణ్యతను మరింత మెరుగుపర్చడమే లక్ష్యంగా యంత్రాంగం పనిచేస్తోందని కలెక్టర్ తెలిపారు.

ప్రజలకు సమయానికి నాణ్యమైన వైద్యం అందించేందుకు అవసరమైన సదుపాయాలు, వైద్య సిబ్బంది సమన్వయం, సేవల పర్యవేక్షణను మరింత బలోపేతం చేస్తున్నట్లు పేర్కొన్నారు.

జిల్లాలో ప్రభుత్వ వైద్య రంగం సాధించిన ఈ విజయంపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, వైద్య సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాల వరకు ఆరోగ్య సేవలను సమర్థవంతంగా విస్తరించడంలో కర్నూలు జిల్లా ఆదర్శంగా నిలుస్తోందని వైద్య వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.


పంచమ వర్ధంతి సమావేశం



కెకెఆర్ సంస్మరణ ప్రసంగం

15 మే, 2026
సాయంత్రం 6 గంటలకు

జననం: 14-06-1941 - నిర్యాణం 15-05-2021

సంస్మరణ ప్రసంగం
తెలుగువారి చరిత్ర - సంస్కరణోద్యమాలు
ఆచార్య వకుళాభరణం రామకృష్ణ


పుస్తకావిష్కరణ
అత్యాధునిక పాశ్చాత్య సాహిత్య విమర్శ - నాలుగు వాచకాలు
(కెకెఆర్ సంస్మరణ ప్రసంగం-2)
ప్రొ. బి. తిరుపతిరావు

తెలుగువారి చరిత్ర - సంస్కరణోద్యమాలు
(కెకెఆర్ సంస్మరణ ప్రసంగం-3)
ఆచార్య వకుళాభరణం రామకృష్ణ

తెలంగాణ సారస్వత పరిషత్
తిలక్ రోడ్, అబిడ్స్, హైదరాబాద్

అందరూ ఆహ్వానితులే... - కుటుంబ సభ్యులు, మిత్రులు, శిష్యులు

# అంతర్ముఖ విప్లవం - ఆత్మ విముక్తి: జిడ్డు కృష్ణమూర్తి జీవన దర్శనం



ప్రపంచ తాత్విక ముఖచిత్రంపై ఒక అరుదైన నక్షత్రంలా మెరిసిన మహామేధావి జిడ్డు కృష్ణమూర్తి. 1895 మే 11న చిత్తూరు జిల్లా మదనపల్లెలో జన్మించిన ఈయన, భారతీయ ఆధ్యాత్మిక వారసత్వాన్ని ఆధునిక వైజ్ఞానిక దృక్పథంతో ముడివేసి ప్రపంచానికి అందించిన అపురూప దార్శనికుడు. ఆయన కేవలం ఒక వ్యక్తి కాదు, ఒక తాత్విక ఉద్యమం. ఏ మతానికీ, ఏ సిద్ధాంతానికీ కట్టుబడని స్వేచ్ఛాలోచనకు ఆయన చిరునామా. 1909లో అడయార్ సముద్ర తీరంలో ఆడుకుంటున్న బాలుడిని చూసి, ఇతడే "ప్రపంచ గురువు" అవుతాడని థియోసాఫికల్ సొసైటీ నేత సి.డబ్ల్యూ. లీడ్‌బీటర్ అంచనా వేయడం ఒక చారిత్రక మలుపు.

అప్పటి నుండి అనీ బిసెంట్ పర్యవేక్షణలో పెరిగిన కృష్ణమూర్తిని విశ్వగురువుగా ప్రతిష్ఠించడానికి "ఆర్డర్ ఆఫ్ ది స్టార్" అనే అంతర్జాతీయ సంస్థ ఆవిర్భవించింది. ఆ సమయంలో ప్రపంచ వ్యాప్తంగా సుమారు 45 దేశాలలో వేలాది మంది అనుచరులు, భారీ ఆస్తులు ఆ సంస్థకు ఉండటం గమనార్హం. అయితే, 1929 ఆగస్టు 3న నెదర్లాండ్స్‌లోని ఓమ్మెన్ నగరంలో జరిగిన సభలో ఆయన చేసిన ప్రకటన ప్రపంచాన్నిగ్భ్రాంతికి గురిచేసింది. తన చుట్టూ ఉన్న వ్యవస్థను రద్దు చేస్తూ, "సత్యం అనేది మార్గరహిత భూమి; దాన్ని ఏ సంస్థ ద్వారా, ఏ గురువు ద్వారా చేరుకోలేము" అని స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక రంగంలో అధికారాన్ని, గురుత్వాన్ని తిరస్కరించిన ఈ సాహసం అపూర్వమైనది.

జిడ్డు కృష్ణమూర్తి బోధనల ప్రధాన సూత్రం మానసిక విప్లవం. మానవుడు తన అంతర్గత స్థితిని తానే గమనించుకోవాలని, అక్కడ ఏ బాహ్య మార్గదర్శకత్వానికి తావులేదని ఆయన నమ్మారు. మనిషి తనను తాను తెలుసుకోవడమే అత్యున్నత విద్య అని ఆయన బోధించారు. భయం, అసూయ, కోపం, దుఃఖం వంటి భావోద్వేగాల మూలాలను విశ్లేషిస్తూ, ఆలోచనకు మరియు ఆలోచనాపరుడికి మధ్య ఉన్న వైరుధ్యాన్ని ఆయన ఎత్తిచూపారు. మనిషి మనస్సు గతంలో అనుభవించిన స్మృతుల ముద్రలతో నిండిపోయిందని, ఆ ముద్రలే వర్తమానాన్ని కలుషితం చేస్తున్నాయని ఆయన విశ్లేషించారు. "నిన్నటి నుండి విముక్తి" పొందడమే నిజమైన స్వేచ్ఛ అని ఆయన భావన. ఆయన దృష్టిలో జాతీయత, మత విద్వేషం అనేవి కేవలం మనస్సు ఏర్పరుచుకున్న విభజన రేఖలు మాత్రమే. ఇవి అంతిమంగా యుద్ధాలకు, హింసకు దారితీస్తాయని హెచ్చరించారు. ప్రపంచ యుద్ధాల తదనంతరం మానవాళి అనుభవిస్తున్న అశాంతికి పరిష్కారం బాహ్య మార్పుల్లో లేదని, అది మనిషి అంతరంగంలో రావాల్సిన విప్లవాత్మక మార్పు అని ఆయన నినదించారు.

విద్యా రంగంలో కృష్ణమూర్తి తెచ్చిన సంస్కరణలు నేటికీ ఆదర్శప్రాయం. విద్య కేవలం జీవనోపాధి కోసం, కేవలం సమాచార సేకరణ కోసం కాదని, అది సంపూర్ణ మానవుడిని తీర్చిదిద్దే ప్రక్రియ కావాలని ఆయన ఆకాంక్షించారు. పోటీ తత్వం, పరీక్షల ఒత్తిడి లేని స్వేచ్ఛాయుత వాతావరణంలో విద్యార్థి వికాసం జరగాలన్నది ఆయన ఆశయం. ఈ లక్ష్యంతోనే రిషి వ్యాలీ (ఆంధ్రప్రదేశ్), రాజఘాట్ (వారణాసి), ది స్కూల్ (చెన్నై), బ్రాక్‌వుడ్ పార్క్ (బ్రిటన్) వంటి ప్రపంచ స్థాయి విద్యాసంస్థలను ఆయన నెలకొల్పారు.

ఇక్కడ విద్యార్థులు కేవలం పుస్తకాలను చదవడమే కాకుండా, ప్రకృతితో మమేకమవ్వడం, మౌనాన్ని అనుభవించడం, తమ మనస్సుల తీరును పరిశీలించడం వంటి విషయాలను అభ్యసిస్తారు. ప్రస్తుతం ఈ పాఠశాలలు ఆధునిక విద్యకు, మానవీయ విలువలకు అద్దం పడుతున్నాయి. భౌతిక శాస్త్రవేత్త డేవిడ్ బోమ్ వంటి వారితో ఆయన జరిపిన సంభాషణలు, విజ్ఞాన శాస్త్రానికి మరియు తత్వశాస్త్రానికి మధ్య ఉన్న అగాధాన్ని పూడ్చాయి. ఆలోచన యొక్క భౌతిక స్వభావాన్ని, కాలం యొక్క పరిమితులను ఆయన వైజ్ఞానిక కోణంలో చర్చించడం ఆనాటి మేధోలోకాన్ని ఆశ్చర్య పరిచింది. కృష్ణమూర్తి గ్రంథాలయాల్లోని వందలాది ప్రసంగాలు, పుస్తకాలు మానవాళికి దిక్సూచిగా నిలిచాయి. "ది ఫస్ట్ అండ్ లాస్ట్ ఫ్రీడమ్" పుస్తకంలో ఆయన స్వేచ్ఛ యొక్క పరమార్థాన్ని వివరించగా, "ఫ్రీడమ్ ఫ్రమ్ ది నోన్"లో తెలిసిన విషయాల నుండి మనసు ఎలా విముక్తి పొందాలో చర్చించారు. ఆయన భాష ఎంతో సరళంగా ఉన్నప్పటికీ, దాని వెనుక ఉన్న విశ్లేషణ అత్యంత లోతైనది. సంప్రదాయ మతాలలోని ఆచారాలను, మూఢ నమ్మకాలను ఆయన నిర్ద్వంద్వంగా వ్యతిరేకించారు. సత్యాన్ని కనుగొనడానికి ఏ మంత్రం, ఏ తంత్రం అవసరం లేదని, కేవలం సజీవమైన అవగాహన ఉంటే సరిపోతుందని చెప్పారు. 1986 ఫిబ్రవరి 17న ఆయన పరమపదించే వరకు, అంటే సుమారు 90 ఏళ్ల వయస్సులో కూడా తన గొంతును ప్రపంచ శాంతి కోసం, మానవ విముక్తి కోసం వినిపిస్తూనే ఉన్నారు. ఇందిరా గాంధీ వంటి రాజకీయ వేత్తలు, ఆల్డస్ హక్స్లీ వంటి రచయితలు ఆయన ప్రభావానికి లోనయ్యారు. నేటి డిజిటల్ యుగంలో సోషల్ మీడియా ప్రభావంతో మనిషి ఒంటరితనం, మానసిక ఒత్తిడి పెరుగుతున్న తరుణంలో కృష్ణమూర్తి బోధనలు మరింత అవసరంగా కనిపిస్తున్నాయి. సాంకేతికత పెరిగినా మానవ ప్రవృత్తిలో క్రూరత్వం, స్వార్థం తగ్గలేదు. మనిషి తనను తాను సంపూర్ణంగా అర్థం చేసుకోనంత కాలం శాంతి అనేది ఒక కల మాత్రమేనన్న ఆయన హెచ్చరిక నేటికీ అక్షర సత్యం. ఆయన ఏ ఒక్క దేశానికో, ఏ ఒక్క మతానికో చెందిన వాడు కాదు; ఆయన ఒక విశ్వ మానవుడు. మానవ చైతన్యంలో మార్పు రావాలని, అది ఎవరికి వారు స్వయంగా సాధించుకోవాలని బోధించిన ఆయన "నిశ్శబ్ద విప్లవ కారుడు". ఆత్మ విమర్శన, నిరంతర అన్వేషణ ద్వారానే మనిషి స్వేచ్ఛగా జీవించగలడని నిరూపించిన జిడ్డు కృష్ణమూర్తి తత్వం, కాలపరీక్షకు నిలిచి భవిష్యత్ తరాలకు ఎల్లప్పుడూ వెలుగునిస్తూనే ఉంటుంది. ఒక భారతీయుడిగా జన్మించి, విశ్వవ్యాప్తమైన ఆలోచనా ధోరణితో ప్రపంచ మేధో సంపదను సుసంపన్నం చేసిన ఆయన చరిత్రలో అజరామరంగా నిలిచి పోతారు.



-రామ కిష్టయ్య
సంగన భట్ల,
9440595494

# 119వ ముంబయి అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (ఎంఐఎఫ్ఎఫ్) ప్రతినిధుల నమోదు ప్రారంభం

న్యూఢిల్లీ, మే 11:మహారాష్ట్రలోని ముంబయి పెడ్డర్ రోడ్డులో ఉన్న ఎన్ఎఫ్‌డీసీ ప్రాంగణంలో జూన్ 15 నుంచి 21, 2026 వరకు 19వ ముంబయి అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (ఎంఐఎఫ్ఎఫ్) వేడుకలు జరగనున్నాయి. ఇందుకోసం ప్రతినిధుల నమోదు ప్రక్రియ ప్రారంభమైనట్లు ఎంఐఎఫ్ఎఫ్ ప్రకటించింది. లఘు చిత్రాల విభాగంలో దక్షిణాసియాలోనే అత్యంత పురాతనమైన, ప్రతిష్ఠాత్మక ఉత్సవాల్లో ఒకటిగా గుర్తింపు పొందిన ఎంఐఎఫ్ఎఫ్? ప్రపంచవ్యాప్తంగా సినీ రూపకర్తలు, కళాకారులు, మీడియా నిపుణులు, సినిమా ప్రేమికులను ఒకచోట చేర్చుతుంది.

కంటెంట్ క్రియేషన్‌లో ప్రపంచ అగ్రగామిగా భారత చలన చిత్ర పరిశ్రమ ఎదుగుతున్న తరుణంలో ఔత్సాహిక సినీ రూపకర్తలకు ముంబయి అంతర్జాతీయ చలన చిత్రోత్సవం కీలక వేదిక కానుంది.

ఎంఐఎఫ్ఎఫ్ రానున్న ఎడిషన్ కోసం ప్రతినిధుల నమోదు ప్రక్రియ అధికారిక పోర్టల్‌లో ప్రారంభమైంది. ఆసక్తి గలవారు ఎంఐఎఫ్ఎఫ్ అధికారిక వెబ్‌సైట ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు.

నూతన వినియోగదారులు తప్పనిసరిగా ఖాతాను సృష్టించుకోవాలి. పాత వినియోగదారులు నేరుగా సైన్-ఇన్ అవ్వచ్చు. దరఖాస్తుదారులు, అవసరమైన వివరాలను అందించి, రూ.500 రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించాల్సి ఉంటుంది.

విద్యార్థులకు రిజిస్ట్రేషన్ ఉచితం. విద్యార్థి విభాగం ద్వారా సమర్పించిన దరఖాస్తులను, అందించిన వివరాలు, పత్రాలను పరిశీలించిన అనంతరం పర్యవేక్షణ బృందం ఆమోదం తెలుపుతుంది.

ప్రతినిధుల నమోదు పక్రియకు సంబంధించిన సహాయం సపోర్ట్ బృందాన్ని సంప్రదించవచ్చు.

ముంబయి అంతర్జాతీయ చలన చిత్రోత్సవం (ఎంఐఎఫ్ఎఫ్) ఒక చరిత్రాత్మక కార్యక్రమం. దక్షిణాసియాలోనే అత్యంత ప్రాచీన, అతిపెద్ద చలన చిత్ర ఉత్సవంగా గుర్తింపు పొందిన ఈ వేడుక? డాక్యుమెంటరీ, కల్పిత లఘు చిత్రాలు, యానిమేషన్ చిత్రాలకు అంకితమైంది. 1990లో (ప్రారంభంలో బాంబే అంతర్జాతీయ చలన చిత్రోత్సవంగా) ఏర్పాటైన ఎంఐఎఫ్ఎఫ్? భారతదేశ, అంతర్జాతీయ సినీ రూపకర్తల అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించే శక్తిమంతమైన వేదికగా మారింది.

19వ ముంబయి అంతర్జాతీయ చలన చిత్రోత్సవం ప్రారంభ, ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు. ఇందులో అంతర్జాతీయ, భారతదేశ పోటీ విభాగాలుంటాయి. ఈ పోటీల్లో ప్రతిష్ఠాత్మకమైన బంగారు, వెండి శంఖాల అవార్డులతో పాటు రూ.55 లక్షల నగదు బహుమతులను అందిస్తారు. వి.శాంతారాం జీవన సాఫల్య పురస్కారం, అత్యంత వినూత్న, ప్రయోగాత్మక చిత్రానికి ప్రమోద్ పతి అవార్డు, సాంకేతిక ప్రతిభా పురస్కారాలు, ఉత్తమ విద్యార్థి చిత్ర పురస్కారం, ఉత్తమ డెబ్యూ దర్శకుడి పురస్కారం వంటివి ఈ వేడుకలో ప్రధాన గౌరవ పురస్కారాలు.

ఈ చలన చిత్రోత్సవంలో పోటీ విభాగాలే కాక ఇతర ఆసక్తికర విభాగాలున్నాయి. అందులో ప్రిజం విభాగం ద్వారా భారత్‌తో పాటు ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ, నూతన ఒరవడిని సృష్టించిన చిత్రాలను ప్రదర్శిస్తారు. అంతర్జాతీయంగా ప్రశంసలు పొందిన, అవార్డులు గెలుచుకున్న చిత్రాలతో ప్రత్యేక విభాగాలు, స్వతంత్ర చిత్రాలు, దేశంపై దృష్టి సారించే చిత్రాలు, తిరిగి నిర్మించిన క్లాసిక్ చిత్రాలు, వన్యప్రాణుల చిత్రాలు, విద్యార్థులు రూపొందించిన చిత్రాలు, న్యూ మీడియా, ఏఐ చిత్రాల వంటి మరెన్నో విభాగాలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి.

గాలా స్క్రీనింగ్స్, రెడ్ కార్పెట్ కార్యక్రమాలు, మాస్టర్ క్లాసులు, ప్యానెల్ చర్చలు, వేవ్స్ డాక్ బజార్ వంటి కార్యక్రమాలను ఎంఐఎఫ్ఎఫ్-2026 నిర్వహించనుంది. చలన చిత్ర రంగంలోని ప్రతిభకు, సృజనాత్మక ఆలోచనల మార్పిడికి సమగ్ర వేడుకగా ఈ కార్యక్రమం నిలుస్తుంది. వేవ్స్ డాక్ బజార్ మొదటిసారిగా ఇమ్మర్సివ్ మార్కెట్‌ను పరిచయం చేస్తోంది. ఇది ఇమ్మర్సివ్ కంటెంట్ క్రియేటర్లు, రూపకర్తలు, సాంకేతిక భాగస్వాముల కోసం ప్రత్యేక వేదిక. ముఖ్యంగా వీఆర్, ఏఆర్, ఎక్స్ఆర్, పరస్పర స్పందన ద్వారా కలిగే అనుభవాలపై దృష్టి సారించే ఈ మార్కెట్.. వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించేందుకు, కొత్త కథా విధానాలను అన్వేషించేందుకు, అర్థవంతమైన సహకారాలను పెంపొందించుకునేందుకు వేదికగా నిలుస్తుంది.

# రూ.6 కోట్లతో రైతు బజార్ విస్తరణకు శ్రీకారం

## -150 మంది రైతులకు ప్రయోజనం.. రెండు అంతస్తులతో ఆధునిక సదుపాయాలు
## -కర్నూలును స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతున్నాం: మంత్రి టీజీ భరత్
## -అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి: ఎంపీ బస్తిపాటి నాగరాజు.



కర్నూలు మే 11: కర్నూలు నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిదేందుకు కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని పరిశ్రమలు, వాణిజ్యం మరియు ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి.భరత్ గుప్త పేర్కొన్నారు. కర్నూలు సి-క్యాంపులోని రైతు బజార్ విస్తరణ పనులకు సోమవారం భూమి పూజ నిర్వహించి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం మంత్రి మాట్లాడారు.

రూ.6 కోట్ల వ్యయంతో చేపడుతున్న ఈ విస్తరణ పనుల ద్వారా సుమారు 150 మంది రైతులకు ప్రత్యక్ష లబ్ధి చేకూరనుందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఉన్న రైతు బజార్‌ను ఆధునిక సదుపాయాలతో విస్తరించనున్నట్లు పేర్కొన్నారు. రైతులకు అవసరమైన స్ప్రింక్లింగ్ సిస్టమ్, డ్రిప్ సిస్టమ్, విశాల పార్కింగ్ సౌకర్యం, రెండు అంతస్తుల భవనం నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. పనులను తొమ్మిది నెలల్లో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు.

సీఎం హామీ అమలు దిశగా చర్యలు..

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గతంలో ఈ రైతు బజార్‌ను సందర్శించిన సందర్భంగా రైతులతో మాట్లాడి విస్తరణకు హామీ ఇచ్చారని మంత్రి గుర్తుచేశారు. 1999లో చంద్రబాబు నాయుడు ప్రారంభించిన రైతు బజార్ వ్యవస్థపై ఆయనకు ప్రత్యేక అభిమానం ఉందని, ఇచ్చిన హామీ మేరకు ఇప్పుడు విస్తరణ పనులు ప్రారంభమవుతున్నాయని తెలిపారు.

రైతు బజార్‌తో పాటు అన్న క్యాంటీన్ రైతు బజార్ నిర్మాణం పూర్తయిన వెంటనే పేదల కోసం ముఖ్యమంత్రి డ్రీమ్ ప్రాజెక్ట్ అయిన అన్న క్యాంటీన్‌ను కూడా ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. కేవలం రూ.15కే మూడు పూటల భోజనం అందించేలా క్యాంటీన్‌ను అభివృద్ధి చేస్తామని తెలిపారు.

హైకోర్టు బెంచ్, నూతన కలెక్టరేట్‌పై మంత్రి స్పష్టం..

కర్నూలు బి-క్యాంపులో హైకోర్టు బెంచ్‌తో పాటు అత్యాధునిక సదుపాయాలతో నూతన కలెక్టరేట్ నిర్మాణానికి కూడా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కర్నూలు అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు.

ప్రతి వారం అభివృద్ధి కార్యక్రమాలు..

ఈ సందర్భంగా కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ, మంత్రి టీజీ భరత్ నాయకత్వంలో కర్నూలులో ప్రతి వారం ఏదో ఒక అభివృద్ధి కార్యక్రమం ప్రారంభమవుతోందని పేర్కొన్నారు. రైతు బజార్ విస్తరణతో ట్రాఫిక్ సమస్యకు కూడా కొంతవరకు పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కర్నూలు మెడికల్ కాలేజ్ రోడ్డు విస్తరణ, స్పోర్ట్స్ హాస్టల్‌ను తిరుపతికి తరలించకుండా కర్నూలులోనే కొనసాగించడం, బి-క్యాంపులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు వంటి పలు కీలక అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు.

ఆధునిక మార్కెటింగ్‌కు ఊతం రైతులు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించుకునే విధంగా రైతు బజార్ విస్తరణ ఉపయోగపడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. పెరుగుతున్న జనాభా, ట్రాఫిక్ సమస్యలు, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆధునిక మార్కెటింగ్ సదుపాయాలతో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మార్కెట్ యార్డ్ అసిస్టెంట్ డైరెక్టర్ నారాయణమూర్తి, మార్కెట్ యార్డ్ సెక్రటరీ జయలక్ష్మి, మార్కెట్ యార్డ్ చైర్మన్ గోల్కొండ అజమత్ బీ, వైస్ చైర్మన్ శేషగిరి, ఇంజనీర్ రఘురామరెడ్డి, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# సాంకేతిక సృజనకు కేరాఫ్.. ప్రాజెక్ట్ ఎక్స్‌పో..

## -విద్యార్థులను అభినందించిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ, మే 11: జాతీయ సాంకేతిక దినోత్సవం సందర్భంగా ఎనికేపాడులోని విజయ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో విద్యార్థుల సృజనాత్మక, సాంకేతిక నైపుణ్యాలను ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రాజెక్ట్ ఎక్స్‌పోను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆటోమేషన్, స్మార్ట్ టెక్నాలజీస్ తదితర ఆధునిక సాంకేతిక రంగాలకు సంబంధించిన పలు వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించారు.

విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు సమాజ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించే విధంగా ఉండటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రదర్శనలో స్మార్ట్ హోమ్ సిస్టమ్స్, ఆటోమేటిక్ కంట్రోల్ మోడల్స్, వ్యవసాయానికి ఉపయోగపడే సాంకేతిక పరికరాలు, రోబోటిక్ మోడల్స్ వంటి అనేక ప్రాజెక్టులు సందర్శకులను ఆకట్టుకున్నాయి.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ? విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను ఆసక్తిగా పరిశీలించారు. ప్రతి ప్రాజెక్ట్ గురించి విద్యార్థులను అడిగి తెలుసుకుని, వారి ప్రతిభ, పరిశోధనా దృక్పథం, సృజనాత్మక ఆలోచనలను అభినందించారు. యువత సాంకేతిక రంగంలో కొత్త ఆవిష్కరణలకు ముందుకు రావాలని ప్రోత్సహిస్తూ, ఇటువంటి ప్రదర్శనలు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.

కళాశాల చైర్మన్ బి.ఎస్.అప్పారావు, సెక్రటరీ బి.శ్రీకృష్ణ అధ్యాపకులు, విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డా. కె. చైతన్య మాట్లాడుతూ, ఈ ప్రాజెక్ట్ ఎక్స్‌పో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు సాంకేతిక రంగంలో ఉన్న అవకాశాలను పరిచయం చేసే వేదికగా నిలిచిందని అన్నారు.

# సేవకు సమయం.. సమాజానికి సహాయం

## -54 రోజుల్లో వేలాది మందికి సేవలు
## -యువత సేవా స్ఫూర్తికి నిదర్శనం
## -యూత్ టైం బ్యాంకు వాలంటీర్లకు ప్రశంసా పత్రాలు అందించిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



విజయవాడ, మే 11:జిల్లాలో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన యూత్ టైం బ్యాంక్ సేవలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారుతున్నాయని, 54 రోజుల్లో వేలాది మందికి సేవలు అందించిన యువత సేవా స్ఫూర్తికి విశేష ప్రశంసలు లభిస్తున్నాయని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమం సందర్భంగా ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్టు విద్యార్థులు, కెరీర్ క్యాంపస్ వాలంటీర్లు మొత్తం 25 మంది ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సేవలందించారు.

పీజీఆర్ఎస్ కార్యక్రమంలో అర్జీలు ఇచ్చేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలకు అవసరమైన సహాయసహకారాలు అందించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ వాలంటీర్లకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మార్చి 16న ప్రారంభమైన యూత్ టైం బ్యాంక్ సేవలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని తెలిపారు.

ఇప్పటివరకు 1,902 మంది వాలంటీర్లు టైం బ్యాంక్‌లో నమోదు కాగా, ప్రభుత్వ ఆసుపత్రుల్లో 4,520 మందికి సేవలు అందించారని చెప్పారు.

వాలంటీర్లు అందించిన మొత్తం పనిగంటలు 7,608గా టైం బ్యాంక్ యాప్‌లో నమోదైనట్లు వెల్లడించారు. కేవలం 54 రోజుల వ్యవధిలో ఇంత పెద్ద స్థాయిలో సేవలు అందించడం యువత సామాజిక బాధ్యతకు నిదర్శనమని పేర్కొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com